శనివారం
5-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 284
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

21 నుంచి రాజ్యసభ

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి రాజ్యసభ 268వ సెషన్ ప్రారంభం కానుందని శుక్రవారం అధికారిక పార్లమెంటరీ బులెటిన్‌లో వెల్లడించారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం పంపించారు. రాజ్యసభ షెడ్యూల్, బిజినెస్ దేస్‌కు సంబంధించిన వివరాలను సభ్యులకు తెలియజేశారు. 21 నుంచి ఆగస్టు 21 వరకు రాజ్యసభ సెషన్ కొనసాగనుంది. స్వాతంత్ర్య వేడుకుల కోసం సభను ఆగస్టు 12న వాయిదా వేయనున్నారు. ఆగస్టు 18న సెషన్ పునఃప్రారంభం కానుంది. ఎప్పటిలాగే ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

నటి రన్యారావు ఆస్తుల జప్తు

బెంగళూరు: కన్నడ నటి రన్యా రావుకు ఈడీ షాక్ ఇచ్చింది. బంగారం అక్రమ రవాణా వ్యవహారంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన నటికి చెందిన రూ.34 కోట్లకు పైగా విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద బెంగళూరులోని విక్టోరియా లే అవుట్‌లోని నివాస భవనం, అర్కావతి లే అవుట్‌లోని నివాస స్థలం, తుమకూరులోని ఇండస్ట్రియల్ భూమి, అనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని జప్తు చేసుకున్నట్లు

- మిగతా 2 లో

7 నుంచి ఏపీఈఏపీసెట్ రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకుగాను ఏపీఈఏపీసెట్–2025 వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూలు ఖరారయింది. ఈ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ఈనెల 7 నుంచి 16వ తేదీ వరకు ఉంటుంది. ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో భాగస్వాములయ్యే అభ్యర్థులు ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలి. 10 నుంచి 18వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 19న సవరణలు, 22న సీట్లను ఖరారు చేస్తారు. సీట్లు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎప్పుడు ఎవరు అరెస్టు చేస్తారో అనే భయంతో నాకు నిద్రపట్టడం లేదు సార్, 2029 వరకూ వేరే పార్టీలో ఉండి వస్తా!

మోదీ పాలనలో
ఆర్థిక విచ్ఛిన్నత

- అబద్ధాలు చెప్పి అధికారంలోకి...
- ట్రంప్ ఫోన్‌కు యుద్ధం ఆపేస్తారా...
- నిరుద్యోగులను మోసగించిన కేసీఆర్
- హామీల అమలులో కాంగ్రెస్ చరిత్ర: ఖర్గే

విశాలాంధ్ర – హైదరాబాద్: ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఘాటుగా విమర్శించారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యమని, దేశ ఆర్థిక స్థితిని మోదీ చిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌తో పాటు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు అని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరన్నారు. గతంలో అమెరికా బెదిరించినా ఇందిరాగాంధీ భయపడలేదని గుర్తు చేశారు. దేశం కోసం ఇందిర, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారు... బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా అని నిలదీశారు. 42 దేశాలు తిరిగిన మోదీ... మణిపూర్ వెళ్లడానికి ఎందుకు ఇష్టపడడం లేదని అన్నారు. మణిపూర్ భారత దేశంలో భాగం కాదా... మణిపూర్ ప్రజలు భారతీయులు కాదా మోదీజీ... ముందు దేశ ప్రజల బాధలు వినండి... ఆ తర్వాత విదేశాల సంగతి చూడొచ్చని సలహా ఇచ్చారు.

తెలంగాణలో హామీలను అమలు చేసే ఏకైక పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని ఖర్గే అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కార్యకర్తలేనని అన్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క... ఇలా అందరూ కలిసికట్టుగా బీఆర్‌ఎస్‌ను ఓడించారని చెప్పారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు సన్నబియ్యం, రైతు భరోసా ...ఇలా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోందన్నారు. 50 ఏళ్ల క్రితం

- మిగతా 2 లో

అమెరికాతో వాణిజ్య ఒప్పందం
మరణ శాసనమే

- తక్షణమే చర్చలు ఆపాలి
- బిహార్‌లో ఎస్ఐఆర్ ఉపసంహరించాలి
- 9న సార్వత్రిక సమ్మెకు మద్దతు
- హిమాచల్ రైతులకు పరిహారం ఇవ్వాలి
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూఢిల్లీ: అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందానికి జరుగుతున్న కసరత్తును సీపీఐ ఖండించింది. 'కాంపాక్ట్' వాణిజ్య ఒప్పందం భారతదేశ రైతులకు మరణ శాసనమే అవుతుందని హెచ్చరించింది. అంతేకాకుండా ఆర్థిక వ్యవస్థ గాడి తప్పుతుందని, దేశ యువత దోపిడీకి గురవుతారని, భారత్ సార్వభౌమత్వం కోల్పోతుందని పేర్కొంది. తక్షణమే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా జరిపే చర్చలను ఆపాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈనెల 1,2,3 తేదీల్లో న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో జరిగిన సీపీఐ జాతీయ సమితి తీర్మానించింది. మరికొన్ని తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. సమితి తీర్మానాలను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వ్యవసాయం, డెయిరీ రంగాల్లో అమెరికాకు మార్కెట్ కల్పించడం అంటే మన రైతులకు మరణ శాసనం జారీ చేయడమే అవుతుందని సీపీఐ ఆందోళన వ్యక్తంచేసింది. ఇప్పటికే నూనె గింజలు, సోయా ఉత్పత్తుల దిగుమతుల కారణంగా ధరలు పడిపోవడంతో సోయాబీన్, పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తీర్మానంలో పేర్కొంది. ఈనెల 9న కార్మిక–రైతు సంఘాల సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. కార్మిక సంఘాల డిమాండ్లకు మద్దతు ఇవ్వడమే కాకుండా తమ డిమాండ్ల సాధన కోసం గ్రామీణ భారతాన్ని చైతన్యవంతం చేయాలన్న నిర్ణయంతో సార్వత్రిక సమ్మెకు రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయని పేర్కొంది. కార్మిక సంఘాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకు మద్దతు ప్రకటించింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా సమ్మె జయప్రదానికి పిలుపునిచ్చింది. జాతీయ సమితి సమావేశాలు సీపీఐ కార్యదర్శి రామకృష్ణ పాండా అధ్యక్షతన జరిగాయి. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల పరిశీలన 'ఎస్ఐఆర్' ప్రక్రియ ఉపసంహరణకు డిమాండ్ చేయాలని జాతీయ సమితి ఏకగ్రీవంగా తీర్మానించింది. ఒకటి లేక రెండు నెలల్లో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించాలన్న ఎన్నికల సంఘం ప్రతిపాదనకు సరైన ప్రణాళిక లేదని, ఆచరణలో అర్హులైన ఓటర్లు అనేక మందికి అన్యాయం జరుగుతుందని, అందుకోసమే 2024లో లోక్‌సభ ఎన్నికల కోసం రూపొందించిన ఓటర్ల జాబితాల ఆధారంగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, కొత్త ఓటర్ల పేర్లను మాత్రమే చేర్చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అదే విధంగా వర్షాల కారణంగా నష్టపోయిన హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రజలకు సముచిత పరిహారం డిమాండ్ చేయాలని సీపీఐ జాతీయ సమితి తీర్మానించింది. భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో ఆస్తి నష్టం, పంట నష్టం సంభవించినట్లు పేర్కొంది. కాగా, సమితి సమావేశాల్లో రాజకీయ

- మిగతా 2 లో

స్టాక్ మార్కెట్‌లో భారీ కుంభకోణం

రూ.36,500 కోట్ల మేర మోసం

- వెలుగులోకి జేన్ స్ట్రీట్ అక్రమాలు
- సెబీ కఠిన చర్యలు

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్‌లో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ప్రపంచంలో అతిపెద్ద క్వాంటిటేటివ్ ట్రేడింగ్ సంస్థల్లో ఒకటైన జేన్ స్ట్రీట్... భారత ఇన్వెస్టర్లను మోసం చేసి మార్కెట్‌ను మానిప్యులేషన్ చేసిందని సెబీ ఆరోపించింది. దీనిద్వారా రూ.36,500 కోట్ల భారీ లాభాలు ఆర్జించిందని సెబీ తెలిపింది. దీంతో ఈ సంస్థను ప్రస్తుతం మార్కెట్ నుంచి నిషేధించారు. జేన్ స్ట్రీట్ అనేది 3 వేల మందికి పైగా ఉద్యోగులతో, 45 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక అంతర్జాతీయ వాణిజ్య సంస్థ. గతేడాది భారత మార్కెట్‌లో అత్యంత లాభదాయకమైన ఆప్షన్స్ ట్రేడింగ్ వ్యూహాన్ని రూపొందించినట్లు ఈ సంస్థ గురించి వార్తలు వచ్చాయి. కానీ, ఇప్పుడు ఈ సంస్థపై సెబీ గుర్తించిన అక్రమాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సెబీ దర్యాప్తులో జేన్ స్ట్రీట్ రెండు ప్రధాన వ్యూహాలు ఉపయోగించినట్లు తేలింది. అవేమిటంటే...మార్నింగ్ పంప్, ఆఫ్టర్ నూన్ డంప్ వ్యూహం. ఆ క్రమంలో ఉదయం స్టాక్స్, ఫ్యూచర్స్‌ను భారీగా కొనుగోలు చేసి నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ సూచీలను పెంచేవారు. మధ్యాహ్నం తర్వాత వాటిని భారీగా విక్రయించేవారు. దీనివల్ల మార్కెట్ బలంగా ఉన్నట్లు సామాన్య ఇన్వెస్టర్లు భావించి పెట్టుబడులు పెట్టేవారు. కానీ చివరకు మార్కెట్ పడిపోవడంతో వారు నష్టపోయేవారు. మరో విధానంలో ఆప్షన్స్ ఎక్స్‌పైరీ రోజుల్లో మానిప్యులేషన్. ఆప్షన్స్ కాంట్రాక్ట్‌ల చివరి రోజున మార్కెట్ ముగిసే సమయంలో భారీ ట్రేడ్‌లు చేసి సూచీలను తమకు అనుకూలంగా మార్చేవారు. దీనివల్ల వారి ఆప్షన్స్ పొజిషన్స్ నుంచి భారీ లాభాలు పొందేవారు. ఈ క్రమంలో జేన్ స్ట్రీట్‌కు సంబంధించిన నాలుగు సంస్థలైన జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్, జేఎస్ఐ 2 ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ సింగపూర్ పీటీఈ, జేన్ స్ట్రీట్ ఆసియా ట్రేడింగ్ భారత మార్కెట్‌లో ట్రేడింగ్ చేయకుండా నిషేధించబడ్డాయి. వీటి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు ఉపసంహరణకు కూడా అనుమతి నిషేధించారు. ఫిబ్రవరిలో సెబీ హెచ్చరించినప్పటికీ జేన్ స్ట్రీట్ ఈ అక్రమ ట్రేడింగ్‌ను కొనసాగించింది. దీంతో సెబీ చర్యలు తీసుకుంది. జేన్ స్ట్రీట్ ఈ ఆరోపణలను ఖండించినప్పటికీ ఈ కేసు భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద మానిప్యులేషన్ కేసుల్లో ఒకటిగా నిలిచింది.

పథకాలు ప్రజలకు చేరవేయండి

- పార్టీ పదవితోనే గౌరవం, గుర్తింపు
- కులగణనలో మనదే విజయం
- అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం
- నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలి: రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర – హైదరాబాద్: ఎంత పెద్ద నాయకుడికైన పార్టీ పదవితోనే అందరికీ గౌరవం, గుర్తింపు లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గాంధీభవన్ లో శుక్రవారం టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశంలోనే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కేంద్రం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఎన్నో విజయాలు సాధించామని గుర్తు చేశారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మంది క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో ఎక్కు మందికి ప్రభుత్వంలో పదవులు వరించాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషను, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతున్నాయన్నారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని, మనందరం కలిసికట్టుగా ఈరోజు నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని రెండోసారి

- మిగతా 2 లో

'సిగాచి' ప్రమాదంపై న్యాయ విచారణ

కూనంనేని డిమాండ్

విశాలాంధ్ర– హైదరాబాద్: పాశంమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై న్యాయ విచారణ చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటి నరసింహ, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ కార్యవర్గ సభ్యుడు మంద పవన్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, రాష్ట్ర సమితి సభ్యుడు ప్రకాశ్‌రావుతో కలిసి శుక్రవారం సిగాచి పరిశ్రమలో ప్రమాద స్థలాన్ని కూనంనేని పరిశీలించారు. ఇది దేశ చరిత్రలోనే జరిగిన పెద్ద ప్రమాదం అన్నారు. సేఫ్టీ తనిఖీ, పొల్యూషన్ విభాగం, ప్రతి నిమిషం పరిశీలించే మానిటరింగ్ సిస్టం ఉంటున్నా ప్రమాదం ఎలా జరిగిందో విచారణ చేపట్టాలన్నారు. ఈ ఘటనపై కమిటీలు వేసినా న్యాయ విచారణ చేస్తేనే అన్ని అంశాలు బయటికి వస్తాయన్నారు. హైదరాబాద్ ఫార్మా కంపెనీల హబ్‌గా ఉందని, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కంపెనీ... కాలంచెల్లిన మిషన్‌ను ఉపయోగిస్తుందా,

- మిగతా 2 లో

బీజేపీకి మహిళా సారథి?

రేసులో నిర్మలా సీతారామన్, పురందేశ్వరి

న్యూఢిల్లీ: సంస్థాగత ఎన్నికల ప్రక్రియను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వేగవంతం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో నూతన సారథుల నియామకాలు పూర్తి కావాలి. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను ఖరారు చేశారు. మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలకూ మరికొన్ని రోజుల్లో కొత్త నేతలను నియమించనున్నారు. ఆ తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ

- మిగతా 2 లో

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి

2లో

539 డ్రోన్లు... 11 క్షిపణులు

ఉక్రెయిన్‌పై రష్యా దాడి

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య పోరు భీకరంగా సాగుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా అర్ధరాత్రి దాడి చేసింది. 539 డ్రోన్లు, 11 బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు ప్రయోగించింది. రికార్డు స్థాయిలో డ్రోన్లు, క్షిపణులతో రష్యా తమ దేశంపై విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ వాయు సేన శుక్రవారం ఒక ప్రకటన చేసింది. వాటిలో 270 డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ కూల్చివేయగా, మరో 208 డ్రోన్లను ఎలక్ట్రానిక్ వార్‌ఫోర్ ద్వారా తప్పించినట్లు వాయు సేన వెల్లడించింది. రెండు క్రూయిజ్ క్షిపణులను గగనతల రక్షణ వ్యవస్థ ధ్వంసం చేసినట్లు పేర్కొంది.

నిషేధిత రసాయన ఆయుధాల ప్రయోగం?

ఉక్రెయిన్‌పై రష్యా నిషేధిత రసాయన ఆయుధాలను ప్రయోగించినట్లు నెదర్లాండ్స్ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను ది హేగ్, డచ్ నిఘా సంస్థలు సేకరించాయి. కీవ్ సైనికులను ఉక్కిరిబిక్కిరి చేసి చంపేందుకు వీటిని రష్యా వినియగిస్తున్నదని డచ్ రక్షణ మంత్రి రూబెన్ బ్రెకెల్‌మాన్స్ రాయిటర్స్‌తో అన్నారు. రష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. ఈ ఆయుధాల ప్రయోగంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత తీవ్రం అవుతాయని రూబెన్ హెచ్చరించారు. మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ ఉపయోగించిన క్లోరోపిక్రిన్‌ను రష్యా వాడిందన్నారు. తమకు అందిన సమాచారం ఆధారంగా జరిపిన దర్యాప్తులో ఈ విషయాలు తెలిసినట్లు డచ్ మిలిటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధిపతి పీటర్ రీసింక్ వెల్లడించారు. రసాయన ఆయుధాల కారణంగా ఉక్రెయిన్‌లో మూడు మరణాలు సంభవించినట్లు రూబెన్ చెప్పారు. 2,500 మందికి గాయాలైనట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ నివేదిక ద్వారా తెలిసిందన్నారు. ఈ ఆయుధాలను ఎక్కువ వాడితే ఉక్రెయిన్‌తో పాటు ఇతర దేశాలకు హాని కలుగుతుందని, అందుకోసం రష్యాపై ఆంక్షలు విధించాలన్నారు. ఈ మేరకు ఇంటెలిజెన్స్ నివేదికను డచ్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు రూబెన్ చెప్పారు. ఉక్రెయిన్‌పై క్లోరోపిక్రిన్‌ను రష్యా ఉపయోగిస్తుందని అమెరికా కూడా గతంలో ఆరోపణలు చేసింది. అయితే వాటిని రష్యా ఖండించింది. రసాయన ఆయుధాలను మేము కాదు ఉక్రెయిన్ వాడుతోందని అప్పట్లో రష్యా రక్షణ శాఖ ఎదురు దాడికి దిగింది. విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా స్పందిస్తూ ఫెడరల్ సెక్యూరిటీ అధికారులు ఉక్రెయిన్‌కు తూర్పు వైపున క్లోరోపిక్రిన్ కలిగిన పేలుడు పరికరాల నిల్వలను కనుగొన్నట్లు తెలిపారు. కాగా, ఈ రసాయనం వాడకానికి రష్యా ఏజెంట్లను వినియోగిస్తుందని, ఈ ఆయుధాలకు భారీగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కొత్త శాస్త్రవేత్తలను కూడా నియమిస్తున్నదని ఆరోపణలు ఉన్నాయి.

పుతిన్ నిరాశపరిచారు

ఉక్రెయిన్‌లో యుద్ధం ముగింపు దిశగా పురోగతి లేదు: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్-రష్యా మధ్య కాల్పుల విరమణ దిశగా ఎటువంటి పురోగతి లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీరు తనను నిరాశపర్చిందని శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయనన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపే ఆలోచన పుతిన్‌కు లేదని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో మాట్లాడతానని చెప్పారు. పుతిన్‌కు ఫోన్ చేసినా ఉక్రెయిన్‌లో యుద్ధం ముగింపు దిశగా ఎలాంటి పురోగతి లేదని, రష్యా యుద్ధం ముగించాలని ఆయన అనుకోవడంలేదని ట్రంప్ అన్నారు. 'పుతిన్‌తో చాలా సేపు మాట్లాడాను. ఇరాన్ సహా అనేక అంశాలను చర్చించాను. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు, కాల్పుల విరమణ గురించీ మాట్లాడాను. కానీ ఎలాంటి ఫలితం లేదు' అని అమెరికా అధ్యక్షుడు అసంతృప్తి వ్యక్తంచేశారు. అదే సమయంలో తమ వద్ద ఉన్న ఆయుధాలన్నీ మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌కు ఇచ్చేశారని అన్నారు. బైడెన్ ఉక్రెయిన్‌కు విపరీతంగా ఆయుధాలు అందజేసి దేశ ఆయుధగారాన్ని ఖాళీ చేశారని ట్రంప్ ఆరోపించారు. దేశ భద్రతకు సరిపడా ఆయుధాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఆయుధ కొరత ఏర్పడుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఉక్రెయిన్‌కు పెండింగ్ ఉన్న షిప్‌మెంట్లను ఆపేశామన్నారు. అమెరికా ఇప్పటివరకు 66 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ, సైనిక సాయాన్ని ఉక్రెయిన్‌కు అందజేసిన విషయం విదితమే.

24 గంటల్లో హమాస్ నిర్ణయం రావచ్చు

గాజాలో ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ కోసం అమెరికా తుది ప్రతిపాదనకు హమాస్ అంగీకరిస్తుందా లేదా అన్నది మరో 24 గంటల్లో తేలిపోతుందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు అంగీకరించిందని ఇప్పటికే ప్రకటించిన ట్రంప్... హమాస్ ఒప్పుకున్నదో లేదో 24 గంటల్లో తెలుస్తుందని, ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దామంటూ విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అబ్రహం ఒప్పంద పరిధిని పెంచడం గురించి సౌదీ అరేబియాతో మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు అధ్యక్షుడిగా మొదటిసారి పగ్గాలు చేపట్టినప్పుడు ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాల మధ్య పరిపాలన సంబంధిత సంబంధాల నేపథ్య అబ్రహం ఒప్పందంపై చర్చలు జరిగాయని గుర్తుచేశారు. ఇదిలావుంటే, గాజాలో ఇజ్రాయిల్ యుద్ధాన్ని పూర్తిస్థాయిలో ముగిస్తే తప్ప అమెరికా ప్రతిపాదనకు అంగీకారం తెలుపేది లేదని హమాస్ ఇప్పటికే స్పష్టంచేసింది. మరోవైపు ఇజ్రాయిల్ కాల్పుల విరమణ అంశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆ దేశానికి చెందిన ఇద్దరు అధికారులు వెల్లడించారు. అటు గాజాలో 21 నెలలుగా భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ వైమానిక, భూతల దాడుల్లో ఇప్పటివరకు 56వేల మందికిపైగా పలస్తీనియన్లు చనిపోయారు. వెస్ట్‌బ్యాంక్‌ను వశపర్చుకున్న ఇజ్రాయిల్ దళాలు దానిని పెద్ద జైలుగా మార్చివేశారు. అదే విధంగా గాజాలో తీవ్రస్థాయిలో ఆహార సంక్షోభం సృష్టించి ఆకలి చావుల దుస్థితిని ఇజ్రాయిల్ తెచ్చింది. తాజాగా ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడులు, కాల్పుల్లో 94 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 45 మంది మానవతా సహాయం కోసం వేచివున్నప్పుడు ఇజ్రాయిల్ దళాలు జరిపిన కాల్పుల్లో చనిపోయారు. ఈ మేరకు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది.

పాక్‌లో చొరబాటు యత్నం భగ్నం

30 మంది ఉగ్రవాదుల హతం

పెషావర్: ఆఫ్ఘానిస్థాన్ నుంచి తమ దేశంలోకి చొరబాటుకు జరిగిన యత్నాన్ని పాకిస్థాన్ భగ్నం చేసింది. ఖైబర్ పఖ్‌తుంఖ్వా ప్రావిన్స్‌లో 30 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ మేరకు సైన్యం శుక్రవారం ప్రకటించింది. 'ఆఫ్ఘాన్ సరిహద్దుల గుండా ఉత్తర వజీరిస్తాన్ జిల్లాలోని హసన్ ఖేల్ ప్రాంతంలోకి చొరబడేందుకు అర్ధరాత్రి జరిగిన యత్నాన్ని మా భద్రతా దళాలు భగ్నం చేశాయి' అని పాకిస్థాన్ సైన్యానికి సంబంధించిన మీడియా విభాగం 'ఐఎస్‌పీఆర్' ఒక ప్రకటన చేసింది. ఆపరేషన్ చేపట్టి 30 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు తెలిపింది. వారి నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్ల వెల్లడించింది. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థల అప్రమత్తత, భద్రతా దళాల వృత్తి నైపుణ్యతతో ఈ ఆపరేషన్ విజయవంతం అయిందని తెలిపింది. తమ భూభాగంలోకి ఉగ్రవాదులను అడుగు పెట్టనివ్వమని తేల్చిచెప్పింది. మరోమారు ఇలాంటి ఘటన జరగకుండా ఆఫ్ఘాన్ బాధ్యత తీసుకోవాలని పాక్ సూచించింది.

టిబెట్ వ్యవహారాల్లో జోక్యం వద్దు

భారత్‌కు చైనా స్పష్టీకరణ

బీజింగ్: టిబెట్ వ్యవహారాల్లో తలదూర్చవద్దని భారత్‌కు చైనా తేల్చిచెప్పింది. 'టిబెట్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకోదని, తమ మధ్య బంధాన్ని దెబ్బ తీయదని చైనా ఆశిస్తుంది' అని బీజింగ్ విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటన చేసింది. ఆధ్యాత్మిక గురువు దలైలామా వారసుడి ఎంపికపై నిర్ణయాధికారం ఆయనకున్నట్లు భారత్ పేర్కొనడం చైనాకు నచ్చలేదు. దీంతో టిబెట్ విషయాల్లో జోక్యం ద్వారా తమ దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీయొద్దని భారత్‌కు పరోక్షంగా హెచ్చరించింది.

అసెంబ్లీ మీడియా సలహా మండలి చైర్మన్‌గా ఐరెడ్డి శ్రీనివాసరెడ్డి

స్పీకర్ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా సలహా మండలి చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు, ద న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పొలిటికల్ ఎడిటర్ ఐరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆయన దాదాపు 16 సంవత్సరాలకు పైగా జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. గతంలో ఆంధ్రజ్యోతి, సాక్షి, డెక్కన్ క్రానికల్ పత్రికల్లో వివిధ హోదాల్లో పని చేశారు. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంపై సంపూర్ణ అవగాహన కలిగిన శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆంగ్ల దినపత్రికలో పొలిటికల్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. తనను అసెంబ్లీ మీడియా సలహా మండలి అధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, 15 మందితో ఏర్పాటు చేసిన మీడియా సలహా మండలిలో చైర్మన్‌గా ఐరెడ్డి ,కో చైర్మన్‌గా పోలోజు పరిపూర్ణాచారి, సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు అయితరాజు రంగారావు, బొడ్లపాటి పూర్ణచంద్రారావు, ఎల్.వెంకట్రాం రెడ్డి, పొలంపల్లి ఆంజనేయులు, ఎం.పవన్ కుమార్, భీమనపల్లి అశోక్, బుర్ర ఆంజనేయులు గౌడ్, సురేఖ అబ్బూరి, మహమ్మద్ నయీమ్ వజాహత్, బసవపున్నయ్య, ప్రమోద్ కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బీహెచ్ఎంకే గాంధీ నియమితులయ్యారు.

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర- హైదరాబాద్: నిజాం పాలకుల చేతిలో అమరుడైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, ఈటీ నరసింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్,రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవిందు, బోయ శ్రీరాములు, అంజయ్య, నరసింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మరణ శాసనమే

(మొదటిపేజీ తరువాయి)

ముసాయిదా తీర్మానాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రవేశపెట్టారు. దీనిని సెప్టెంబరు 21 నుంచి 25వ తేదీ వరకు చండీగఢ్‌లో నిర్వహించబోయే జాతీయ మహాసభల్లో ప్రవేశపెడతారు. ఈ ముసాయిదా తీర్మానంపై నాయకులు చర్చించారు. అన్ని అంశాలను నిశితంగా పరిశీలించారు. సవరణలను సూచించారు.

వాటిని జాతీయ కార్యదర్శి వర్గం పరిశీలించిన తర్వాత నిర్ణయిస్తుందని, ఆపై తుది ముసాయిదా రూపొందించాలని సమావేశం నిర్ణయించింది.

'సిగాచి' ప్రమాదంపై న్యాయ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు డయ్యర్ బ్లాస్టర్‌కు కారణం మానవ తప్పిదమా, యంత్ర తప్పిదమా అనేది విచారణ చేపట్టడం ద్వారానే తెలుస్తుందన్నారు. కంపెనీలో పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ.550 ఇస్తే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సేఫ్టీ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయలేదని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రమాద తీవ్రత, లోపాలపై సుప్రీంకోర్టు లేదా కనీసం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జలాలుద్దీన్ అన్నారు. కాగా, పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

కౌలు రైతు కష్టాలు తీరేనా?

విశాలాంధ్ర- సచివాలయం:

సేద్యం వారిదే...

సాగుపెట్టుబడి కూడా వారిదే...

భూమి మాత్రం వేరొకరిది... పంట పండినా పండకపోయినా, ప్రకృతి విపత్తులొచ్చి పంట చేతికందక నష్టం వచ్చినా భూమి యజమానికి కౌలు చెల్లించాల్సిందే. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవను త్వరలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు కూడా ఇస్తామని చెబుతున్నా... ఇంతవరకు సాగుచేస్తున్న రైతులకు కౌలు కార్డులు ఇవ్వలేదు. కష్టపడి పంటలు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ భూమి కలిగిన రైతులు మాత్రమే ప్రభుత్వం దష్టిలో అన్నదాతలుగా పరిగణింపబడటమే ఈ దుస్థితికి కారణం. ప్రభుత్వం అందించే ఎలాంటి పథకాలు వర్తించకున్నా... సబ్సిడీలు, ఉచిత పథకాలు, పంట నష్టపోతే పరిహారం రాకున్నా వ్యవసాయమే జీవనాధారంగా కైలు రైతులు శ్రమ చేస్తున్నారు. కౌలురైతుల్లో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. రాష్ట్రంలోని 60.73 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణంలో 27.15 లక్షల హెక్టార్లు అంటే 44 శాతం వ్యవసాయ విస్తీర్ణంలో కౌలు రైతులు సాగుచేస్తున్నారు. రైతు సంఘాలు మాత్రం రాష్ట్రంలో సుమారు 32 లక్షల మంది కౌలు రైతులున్నారని, వారిలో 10 శాతం మందికి కూడా ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు అందటం లేదని చెబుతున్నాయి. కౌలు రైతులు గ్రామాల్లో రెండు రకాలుగా ఉన్నారు. పూర్తిస్థాయిలో భూమి లేనివారు ఇతరుల నుంచి భూమి తీసుకుని సాగు చేస్తున్నారు. వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకుని ఉండే రైతులు తమకున్న ఎకరం, రెండకరాలతో పాటు తమ సామర్థ్యానికి అనుగుణంగా తమ పక్కన ఉన్న భూములనో లేదా ఇతర చోట్ల ఉన్న భూములనో కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇలాంటి చిన్న, సన్నకారు రైతులు కౌలుకు తీసుకుని చేసే పద్ధతి ఎక్కువ శాతం ఉంటుంది. సాగు వ్యయం భారీగా పెరగటంతో పాటు భూమి యజమానికి లాభనష్టాలతో సంబంధం లేకుండా కౌలు చెల్లించాల్సి రావటం, వడ్డీలేని పంట రుణాలు, రైతు భరోసా, పంటల బీమా, పంట నష్టపరిహారం తదితర పథకాల లబ్ధిదారుల జాబితాలో కౌలు రైతులకు చోటు లభించడం లేదు. దీంతో అనివార్యంగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధికవడ్డీకి నగదు తీసుకుని సాగు చేయాల్సిన పరిస్థితులు కౌలు రైతులను సంక్షోభంలోకి నెట్టివేశాయని కౌలు రైతు సంఘాలు చెబుతున్నాయి. ఎకరా భూమికి రైతులు చెల్లించే కౌలు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. నీరు సమద్ధిగా ఉండి, అనుకూలమైన భూమి ఉంటే కౌలు డబ్బులు అధిక మొత్తంలో చెల్లించక తప్పడం లేదు. ఇలా రైతు కౌలుచేస్తే భూ యజమానికి ఇవ్వగా మిగిలేది కూలి కూడా కష్టమేనని స్పష్టమవుతోంది. అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా తట్టుకొని సాగు చేసినా చివరకు నష్టాలే మిగిలుతున్నాయి. నిబంధనల ప్రకారం కౌలు రైతులను గుర్తించి...

అన్నదాత సుఖీభవ అందేదెలా?

వారికి రుణ అర్హత కార్డులు అందచేసి... బ్యాంకు రుణాలు ఇవ్వాలి. కానీ, వీరిపై రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాగం ఎలాంటి దయ చూపడం లేదు. కౌలు రైతులు ఎలాంటి సహకారానికి నోచుకోవడం లేదు. కౌలు రైతులకు ఇతర రంగాల్లో ప్రావీణ్యం లేకపోవడంతో లాభనష్టాలతో సంబంధం లేకుండా కౌలు చెల్లించి వ్యవసాయం కొనసాగిస్తున్నారు. కౌలు రైతులకు ఎక్కడా అధికారిక గుర్తింపు లేకపోవడంతో రైతుల సంక్షేమ పథకానికి వీరు అనర్హులుగా మిగిలిపోతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పథకాలను సైతం అత్యధిక మంది పొందలేకపోయారు. కనీసం బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందలేకపోతున్నారు. వడ్డీ వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకుని వ్యవసాయం చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం అందించే అన్ని రకాల సాయం తమకు దక్కేలా చూడాలని, కూటమి ప్రభుత్వమైనా గత ప్రభుత్వ నిబంధనలు సడలించి సీసీఆర్‌సీ కార్డులు అందించేలా చర్యలు చేపట్టాలని కౌలు రైతులు కోరుతున్నారు.

మోదీ పాలనలో ఆర్థిక విచ్ఛిన్నత

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన ఎమర్జెన్సీ గురించి మాట్లాడే బీజేపీ నేతలు 11 ఏళ్ల వారి పాలనలోని ఎమర్జెన్సీ పరిస్థితులు గురించి ఎందుకు మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవులు ఇవ్వాలని టీపీసీసీకి సూచించారు. ఇష్టానుసారం మాట్లాడొద్దని, పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలని నేతలకు సూచించారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారన్నారు.

బీజేపీకి మహిళా సారథి?

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వెలువడుతున్నాయి. జాతీయ అధ్యక్ష పదవి రేసులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ బీజేపీ ఎంపీ పురందేశ్వరి, బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా, బీజేపీ అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. మోదీ ప్రభుత్వంలో 2019లో తొలిసారి నిర్మలా సీతారామన్ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి... ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఇటీవల బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోశ్‌ను నిర్మలా సీతారామన్ కలిసినట్లు తెలుస్తోంది. నిర్మలా సీతారామన్‌కు ఆర్ఎస్ఎస్ పూర్తి మద్దతు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ కుయుక్తుల్ని అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటుచేసిన ఏడు అఖిలపక్ష బృందాల్లోని ఓ బృందానికి పురందేశ్వరి ప్రాతినిధ్యం వహించారు. ఫ్రాన్స్, బ్రిటన్, ఈయూ, ఇటలీ, డెన్మార్క్, జర్మనీ దేశాల్లో పర్యటించి... ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచ దేశాలకు స్పష్టంచేశారు. ఇక బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ 1993 నుంచి బీజేపీలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. మొత్తంమీద ఈసారి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి దక్షిణాదికి చెందిన మహిళకు దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పథకాలు ప్రజలకు చేరవేయండి

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. రాష్ట్రంలో రాబోయే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని స్పష్టం చేశారు. సుదీర్ఘ కాలం ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన అరుదైన ఘనత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేదని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాన్ని మల్లికార్జున్ ఖర్గేతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ బెదిరింపులకు భయపడం

విశాలాంధ్ర-మార్కాపురం: గతంలో వైసీపీ పాలకులకు రౌడీయిజం తప్ప ప్రజల నీటి సమస్య తీర్చే చిత్తశుద్ధి లేకపోయిందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. '2029లో అధికారంలోకి వస్తే అంతు చూస్తామని వైసీపీ నేతలు బెదిరిస్తున్నారు. అసలు వీళ్ల ఎలా అధికారంలోకి వస్తారో మేమూ చూస్తాం. వైసీపీ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు' అని పవన్ అన్నారు. ప్రకాశం జిల్లా తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని పవన్ కల్యాణ్ అన్నారు. తొలిసారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. దాదాపు 10 లక్షల పైచిలుకు జనాభాకు తాగునీటిని అందించబోతున్నామని ఉద్ఘాటించారు. పవన్ కల్యాణ్ శుక్రవారం నరసింహపురంలో రూ.1,290 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలని పవన్ అన్నారు. తాగునీరు లేక ఊర్లకు ఊర్లే ఖాళీ అవుతున్నాయని, ప్రజలు వలసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా పుష్కలంగా సాగు-తాగు నీరు అందించవచ్చని, అందుకోసం తమ వంతు కృషి చేస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జల్ జీవన్ మిషన్‌లో మొదటి విడతగా రూ.1,290 కోట్లతో పనులకు శంకుస్థాపన చేసుకున్నామని, ప్రాజెక్టు పూర్తి అయితే 18 మండలాల తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. ప్రకాశం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని పవన్ గుర్తుచేసుకున్నారు. 'నాన్న ఉద్యోగరీత్యా మా కుటుంబం ఒంగోలు, కనిగిరిలో రెండేళ్లకుపైగా ఉంది. నేను కనిగిరిలో ఆరు నెలలు మాత్రమే ఉన్నా. ఆ ప్రాంతంలో ఫ్లోరైడ్‌తో ప్రజల కాళ్లు, వెన్నెముక వంకరపోవడం వంటివి చూశా. ఇక్కడి నీటి కష్టాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు' అని అన్నారు. సకాలంలో నిధులు వస్తే 18-20 నెలల్లో జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. వైసీపీ నాయకుల ఆగడాలను ఆయన గుర్తుచేశారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వైసీపీ హయాంలో ఖాళీ భూములు దోచేశారని, ఆక్రమణకు గురైన ఆలయాల భూములను వెనక్కి తీసుకుని, రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని పవన్ తెలిపారు. మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి టీసీఎస్, కాగ్నిజెంట్, లులు, హెచ్‌సీఎల్, డైకాన్ వంటి ప్రతిష్ఠాత్మక కంపెనీలు వచ్చాయని, త్వరలోనే తొమ్మిది లక్షలకుపైగా ఉద్యోగాలు రాబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, బీఎన్ విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి, ముత్తుమల అశోక్ రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, టీడీపీ, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

7 నుంచి ఏపీఈఏపీసెట్ రిజిస్ట్రేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో 23 నుంచి 26 లోపు రిపోర్టు చేయాలి. ఆగస్టు 4 నుంచి ఇంజినీరింగ్ కళాశాలలు ప్రారంభమవుతాయి. మొదట ఈ నెల 17వ తేదీ నుంచి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని భావించినప్పటికీ... తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తయినందున షెడ్యూల్ మార్చారు. ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలు నోటిఫికేషన్‌ను అధికారికంగా శనివారం విడుదల చేస్తారు. పూర్తి వివరాలను ఏపీఈఏపీసెట్ 2025 అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

నటి రన్యారావు ఆస్తుల జప్తు

(మొదటిపేజీ తరువాయి)

ఈడీ అధికారులు వెల్లడించారు. ఆస్తుల మార్కెట్ విలువ రూ.34.12 కోట్లు ఉంటుందని వెల్లడించారు. గోల్డ్ స్మగ్లింగ్ రాకెట్‌పై సీబీఐ, డీఆర్ఐ అధికారుల ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆమెపై పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తోంది. గోల్డ్ స్మగ్లింగ్ సిండికేట్‌లో ఆమె చురుకైన పాత్రను గుర్తించిన ఈడీ.. తాజాగా ఆమె ఆస్తులను జప్తు చేసింది.

తుంగభద్ర డ్యామ్ 21 గేట్లు ఎత్తివేత



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: తుంగభద్ర డ్యామ్ 21 గేట్లు ఎత్తి... దిగువకు 59,220 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 53,144 క్యూసెక్కులు కాగా... ఔట్‌ఫ్లో 59,220 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుతం 1624.76 అడుగులకు చేరింది. పూర్తి నీటి సామర్థ్యం 105 టీఎంసీలు కాగా ప్రస్తుతం 75.71 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం జలాశయంలో పూర్తి నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 167.88 టీఎంసీలు. పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 875.90 అడుగులు నిల్వ ఉంది. జలాశయానికి ఇన్‌ఫ్లో 79620 క్యూసెక్కుల చేరుతుండగా, కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల విద్యుత్ ఉత్పత్తికి 61066 క్యూసెక్కుల నీరు ఉపయోగిస్తున్నారు.

మహనీయుల జీవితం అందరికీ ఆదర్శం : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి కలెక్టర్ దొడ్డి కొమురయ్య వర్ధంతి, కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొని వారి ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖతోపాటు రోడ్లు భవనాలు రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా హెూమ్ మినిస్టర్ వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రిగా కొంత కాలం సేవలు అందించారని, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా పని చేసారని తెలిపారు. బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.నరసింహస్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ఉద్యానవన అధికారి మరియన్న, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్, మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, వినోద్, ఐడిఓసిలోని అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర - తొర్రూర్: మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తొర్రూరు మున్సిపల్ కమిషనర్ వక్కాల శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రోశయ్య జన్మదిన వేడుకలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 16 సార్లు ఆర్థికశాఖ మంత్రిగా బడ్జెట్ ప్రవేశపెట్టారని ఘనత కొణిజేటి రోశయ్య దక్కుతుందని అన్నారు. తమిళనాడు గవర్నర్గా కూడా ఆయన సేవలందించారని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మేనేజర్ కట్టస్వామి, రాజయ్య, వార్డ్‌ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, జిల్లా పౌర సంబంధాల అధికారి యండి రఫిక్, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, సలీం, రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాలకు గవర్నర్‌గా విశిష్టమైన సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని రోశయ్య సేవల్ని స్మరించుకున్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ ల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి,అయన చిత్ర పటానికి,జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రజాసేవలో ఉంటూ ప్రజలకు సేవ చేసిన రోశయ్య గారీ జీవితం అందరికీ స్పూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు.ఇట్టి కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సదానందం, ఎస్బి ఇన్స్పెక్టర్ శంకర్, డిపిఓ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐలు స్వామి, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమాన అవకాశాలు : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : కాగజ్ నగర్ సమాజంలో అన్ని వర్గాలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్.పి.ఎం. క్లబ్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ట్రై సైకిల్ పంపిణీ కార్యక్రమంలో కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, యూనిట్ హెడ్ ఎ.కె. మిశ్రా లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల అవసరాలను తీర్చడంలో సమాజంలో ప్రతి ఒక్కరికి బాధ్యత ఉంటుందని, సామాజిక సంక్షేమం పట్ల సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం తమ నిబద్ధతను చాటిందని అభినందించారు. అనంతరం 20 మంది దివ్యాంగులకు మోటార్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ కోరారు. శుక్రవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్ వద్ద జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేయడానికి నిరసనగా ఈ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు హరి, రామాంజనేయ, బడికల పోచం, నర్సయ్య, శ్రీనివాస్‌తో పాటు కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం జిల్లాలో ఉన్న పలు సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను సందర్శించి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆమె ప్రత్యక్షంగా సందర్శించి ఆయా పాఠశాలలు, కళాశాలలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అంతేకాకుండా కావలసిన మౌలిక సదుపాయాల వివరాలను సేకరించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ముందుగా గుండ్లపల్లి (డిండి) మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల వివరాలు కనుకున్నారు. ఆ తర్వాత చందంపేట గిరిజన బాలికల మినీ గురుకులాన్ని సందర్శించి అక్కడ కూడా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత దేవరకొండలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల గురుకుల ప్రతిభా పాఠశాల/ కళాశాల, గిరిజన బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల, కొండభీమనపల్లి వద్ద ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల/ కళాశాల, అలాగే తెలంగాణ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, అవసరమైన మౌలికవసతులను పరిశీలించారు. ఆ తర్వాత కొండమల్లేపల్లిలో సైతం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో, తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో, మహాత్మ జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్గొండ జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలల్లో, బిసి గర్ల్స్ హాస్టల్, జీవీ గూడెంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కాగా ఆయా పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన అదనపు బ్లాకులు, విద్యార్థులకు టాయిలెట్లు, బాత్రూంలు, డ్యూయల్ డేస్కులు, తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మంచాలు, తదితర అవసరాలను అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో తాగునీటి ఓహెచ్ఎస్ఆర్‌లు కావాలని, అదనంగా టాయిలెట్ బ్లాకులు కావాలని, డార్మెటరీ కావాలని, కాంపౌండ్ వాల్, బాత్రూంలు, సోలార్ ఫెన్సింగ్, డ్యూయల్ డెస్కులు, రెసిడెన్షియల్ బ్లాక్లులు, మంచాలు కావాలని జిల్లా కలెక్టర్‌తో ఆయా కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపల్స్ తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఆయా పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపల్స్‌తో పాటు, దేవరకొండ ఆర్‌డిఓ రమణారెడ్డి, సంబంధిత సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల రీజినల్ కో-ఆర్డినేటర్లు, తదితరులు ఉన్నారు.

సీజనల్ వైద్యులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వైద్యుల పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మిక తనిఖీ చేసి, హాస్పిటల్లోని, క్యాజువల్టీ, పి.ఎస్.సి., డెంగు వార్డులను పరిశీలించి, రోగుల యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలు తీరును అలాగే మెనూ ప్రకారంగా అందజేస్తున్న భోజన సౌకర్యాన్ని రోగులను మొదలగు విషయాలను రోగులను అడిగి తెలుసుకు న్నారు. హస్పిటల్కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పటల్ సూపరింటెంట్ సురేష్‌కు తెలిపారు. అలాగే హాస్పిటల్ బిల్డింగును పరిశీలించి కారిడార్లో లీకవుతున్న నీటి తిరును కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెంట్ డాక్టర్ సురేష్, ఆసుపత్రి స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పర్యటించిన కలెక్టర్

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫ్రీడమ్ పాఠశాల, కళాశాలలో మౌలిక సదుపాయాలపై శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. అక్కడున్న విద్యార్థుల సంఖ్య, వసతులు, అదనపు మంచాలు, గదులు, తాగునీటి వసతి, తరగతి గదులు టాయిలెట్లు డార్మెటరీ తదితర సమస్యలను పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల రీజినల్ కో బలరాం నాయక్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ నుండి హైదరాబాదులో జరుగు జై భీమ్ జై బాపూ జై సంవిధాన్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రభంజనంలా కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం దొన్కెన దయానంద్, తోట సత్యం తదితర కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

9న దేశవ్యాప్త సమయం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఖమ్మం : జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ మోడీ పాలనలో గత 10 ఏళ్ళుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లను తెచ్చారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు, పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారని యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారని, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు. శతకోటీశ్వరుల సంఖ్య 102 మంది నుండి 166 మందికి పెరిగిందని పేర్కొన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు, ఐద్వారాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ బొంతు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన డీసీసీబీ అధికారులకు వీడ్కోలు

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రభుత్వ అధికారులు సేవా భావంతో పనిచేస్తేనే ఎంతో సంతృప్తి కలుగుతుందని కారేపల్లి డిసిసిబి మేనేజర్ బాల రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కారేపల్లిలోని డీసీసీబీ బ్యాంకులో పనిచేసి బదిలీ అయిన అధికారులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డీసీసీబీ కారేపల్లి బ్రాంచీలో అసిస్టెంట్ మేనేజర్ గోపతి పద్మావతి, క్యాషియర్ ఆలేటి గాయత్రిలు ఖమ్మంలోని బ్రాంచీలకు బదిలీ అయ్యారు. కారేపల్లి బ్రాంచీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మేనేజర్ బాల రవికుమార్ మాట్లాడుతూ డీసీసీబీలో రైతులకు సేవ చేయటం ఎంతో అనందాన్ని ఇస్తుందన్నారు. వృత్తిలో ఖాతాదారుల అభిమానాన్ని చూరగొనటం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. సూపర్‌వైజర్ కొంగర వేణు,ఉద్యోగులు అరుణ,సురేష్,వెంకట్రావు, పుచ్చకాయల వంశీ,ఆదెర్ల అంజమ్మ,సొసైటీ సిబ్బంది ఉండం సాంభశివరావు, ముండ్ల సురేష్,దమ్మాలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి అన్నారు. శుక్రవారం జిల్లాలో 16వ మండలం మహాసభ తండ సతీష్, కొమ్ము నారాయణ, కౌసల్య ల అధ్యక్షతన జరిగినయి మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. కమ్యూనిస్టుల పోరాటం అజరామరమని అన్నారు. దేశభక్తులు అని చెప్పుకుంటున్న బిజెపి నరేంద్ర మోడీ నిజమైన దేశభక్తులు కాదని, దేశాన్ని విభజించి పాలించే వారికి దేశభక్తులుగా చెప్పుకునే అర్హత లేదన్నారు. దేశంలో స్వాతంత్ర ఉద్యమంలో పోరాడిన అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి, ఏ చరిత్రలో చూసిన కమ్యూనిస్టులదే పెద్ద పాత్ర అన్నారు. మానుకోట ప్రాంతంలో అనేక ఉద్యమాలు నిర్వహించి వేలాది మందికి ఇంటి స్థలాలు పంచిన చరిత్ర సిపిఐదే అన్నారు. 5, 6న కొరివిలో జరుగుతున్న సిపిఐ మహబూబాబాద్ జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ మహబూబాబాద్ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధిరెడ్డి మాట్లాడుతూ రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్లోజు పాండురంగాచారి, సిపిఐ మండల కార్యదర్శి తండా సందీప్, బానోతు లింగ్య నాయక్, కొమ్ము నారాయణ, తండా సతీష్, కౌసల్య, పొలగాని శ్రీను, జుజ్జూరు గురుస్వామి, శేఖర్, సాయి, తండా మున్నా, తేజావత్ శ్రీను, వినయ్, విజయ్, కృష్ణ, పెరుగు కుమార్, రేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్, ఆబోతు అశోక్, సుమన్, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో రైతులకు సహకారానికి యంత్రాంగం సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - వనపర్తి : జిల్లాలో ఖరీఫ్ లో సాగుకు సమయం వచ్చేసిందని అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో రైతులకు సహకారానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధం కావాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాబర్ట్ కోరారు. శుక్రవారం శ్వేత నగర్ కటికనేని గోపాల్ రావు భవన్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసారి తొలకరి వర్షాలు ముందే వచ్చాయని జూరాల నిండిందని, కేఎల్ఐ ఎత్తిపోతలకు నీరు అందించే శ్రీశైలం ప్రాజెక్టు నిండే స్థాయికి చేరిందన్నారు. కే ఎల్ ఐ, భీమా, జూరాల, రామన్ పాడు ప్రాజెక్టు నుంచి వనపర్తి జిల్లాలో సాగుకు పూర్తిస్థాయిలో నీటి విడుదల చేయలేదన్నారు. వనపర్తి కొల్లాపూర్ నియోజక వర్గాల్లో సుమారు లక్ష ఇరవై ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందించే బీమా ఫెస్ టు ప్యాకేజ్ నెంబర్ 27 కాలువకు నీరు వదల లేదన్నారు. జూరాల ప్రాజెక్టు నాలుగు గేట్ల రోప్ తెగిపోయిందని ఇంతవరకు మరమ్మత్తులు మొదలు కాలేదు అన్నారు. జిల్లాలోఖరీఫ్ లో వరి వేరుశనగ ఆముదం కంది మొక్కజొన్న జొన్న పంటలు సాగు చేస్తారని విత్తనాలను ఎరువులను సిద్ధంగా ఉంచాలన్నారు. పంటలకు పెట్టుబడి ముఖ్యమని బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని చెబుతున్నారని నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. నేతలు రమేష్, మోష, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

రెండు లారీలు ఢీ : ముగ్గురి మృతి

విశాలాంధ్ర-మరిపెడ: క్షణాలలో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, ఓ క్లీనర్ మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విదారక సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం యల్లంపేట స్టేజీ సమీపంలో జాతీయ రహదారి 563పై శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, జోధ్పూర్, కేజర్ల ప్రాంతానికి చెందిన రాజురాం చౌదరికి ఇద్దరు కుమారులు. లారీ ట్రాన్స్ పోర్ట్ నడుపుకుంటు జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగానే చాపల దాణ కోసం విజయవాడకు తండ్రి, చిన్న కుమారుడు సర్వణ్ రాం(23) రెండు లారీలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు వచ్చారు. చాపల దాణ లోడ్ అయిన అనంతరం ఈ నెల 2వ తేదీన విజయవాడ నుంచి రాజస్థాన్ కు వారి వారి లారీలతో బయల్దేరారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోతు గణేష్(30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో కాకినాడ వెళ్తున్నాడు. కాగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం యల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్ రాం లారీ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాళ్లు క్యాబిన్లపైకి దూసుకురావటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోతు గణేష్, సర్వణ్ రాం(23), క్లీనర్ బర్గత్ ఖాన్(23) సజీవ దహనమయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. వెనకాలే వస్తున్న తండ్రి రాజురాం చౌదరి తన కుమారుడి వాహనం ప్రమాదని గుర్తైనట్లు తెలిపారు. మృతుడు గణేష్ కు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్ కు కూడా ఇటీవలే వివాహమైనట్లు తెలుస్తోంది. సీఐ రాజ్ కుమార్, ఎస్ఐలు బొలగాని సతీష్, గండ్ర సంతోష్ జేసీబీల సహాయంతో లారీలను జరిపి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

టాప్ లిట్ అప్ డ్రాఫ్ట్ పద్ధతిలో నాణ్యమైన బయోచార్ తయారీ: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : టాప్ లిట్ అప్ డ్రాఫ్ట్ పద్ధతి ద్వారా నాణ్యమైన బయోచర్ తయారు చేయవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రయోగాత్మకంగా చూపించారు. ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన సుజాతనగర్ మండలంలోని మేకలగడ్డ గ్రామంలోని బయోచార్ తయారీ యూనిట్ ప్రక్రియను ఆయన శుక్రవారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఈ ప్రయత్నంలో 30 కిలోల వేస్ట్ కట్టెముక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి మండించడం ద్వారా 10 కిలోల నాణ్యమైన బయోచార్ తయారు చేయగలిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలా తయారైన బయోచార్‌ను అవుపంచకం (అవుపేడ మొదలైనవి) తో కలిపి కొన్ని రోజులు నిల్వ ఉంచి తదుపరి ఆరబెట్టి, పొడిగా చేసి పంటలకు ఎరువుగా ఉపయోగించాలని రైతులకు కలెక్టర్ సూచించారు. డివిజన్లోని రైతువేదికల ద్వారా బయోచార్ తయారీ విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో విరివిగా లభించే ఎండు కట్టెలు, సర్కారు తుమ్మ చెట్టు కొమ్మలు, రహదారులు, కరెంట్ తీగలకు అడ్డంగా ఉన్న కొమ్మలను ఉపయోగించి తక్కువ ఆక్సిజన్‌లో పి ఎల్ యు డబ్ల్యూ పద్ధతిలో బయోచార్ తయారు చేయాలని సూచించారు. సుజాతనగర్ తహసీల్దార్ ఈసి రాజు, ఏడియే (టెక్నికల్), వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

ఆదివాసీలకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుంది : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలు సమగ్రంగా అభివృద్ధి అయ్యేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన లక్ష్మీదేవిపల్లి మండలం గంగమ్మ కాలనీ గుత్తి కోయ గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో ఓఎస్ డి జి జితేందర్, డిఎస్పీ అబ్దుల్ రెహమాన్‌తొ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి కుటుంబాలతో అన్నివిధాలా అభివృద్ధి చెందాలని సాధ్యమైన బంగారం చేస్తున్నారని వెల్లడించారు. ఆదివాసీ ప్రజలకు తొలుత కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు. అదేవిధంగా ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల్లోకి ఎవరైనా అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. అనంతరం ఎస్పీ తన చేతుల మీదుగా అక్కడ నివసించే 27 కుటుంబాల వారికి దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. విద్యుత్, మొబైల్ నెట్వర్క్ సమస్యలకు సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని వారికీ ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి, ఎస్సై కార్తీక్, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై మిలిటెంట్ ఉద్యమాలు చేపడతాం

విశాలాంధ్ర - కొత్తగూడెం : విద్య సమస్యలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లోపాయికారి విధానాలపై మినీ టైం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. పాల్వంచలో ఇటీవల జరిగిన జిల్లా అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాలుగో మహాసభలో ఎన్నికైన నూతన ఆఫీస్ బేరర్లు, కౌన్సిల్ సభ్యులను శుక్రవారం శేషగిరిభవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ కె. ఫహీమ్ దాదా ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్ కే. షాహిద్, కార్యదర్శిగా వర్క అజిత్, సంయుక్త కార్యదర్శిగా ఎం. వినయ్, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర బాబు, టి వినయ్, పవన్ కళ్యాణ్, సంజయ్, సహాయ కార్యదర్శులుగా గుండాల సృజన్, పవన్ సాయి, గుగులోత్ వంశి, బత్తుల సాయి, ఎన్ సాయికుమార్లతో పాటు మరో 36 మంది కౌన్సిల్, 18మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఫహీమ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు షాహెద్, అజిత్ మాట్లాడుతూ విద్యార్థుల బకాయి ఉపకారవేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విమర్శించారు. ఉపకారవేతనాల సమస్యతోపాటు ఇతర తొమ్మిది అంశాలపై మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. వీటి సాధనకోసం జిల్లావ్యాపితంగా మిలిటెంట్ ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వరంగ సంస్థలను తాకట్టుపెట్టే కేంద్రం చర్యలను ప్రతిఘటిద్దాం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ సహజ వనరులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 11 నెల కాలంలో తన బినామీ కార్పొరేట్ శక్తులకు తెగ నమ్మేస్తుందని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఫెడరేషన్లు అసోసియేషన్ సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెంలో భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దేశ సంపద, సహజ వనుల రక్షణ, కార్మిక చట్టాల పరిరక్షణకోసం జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. సమ్మెను జయప్రదం చేయాలనీ కోరుతూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల, అసోసియేషన్ల పిలుపుమేరకు కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన సెంటర్ల మీదుగా బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీ ప్రారంభ, ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, సిఐటీయు జిల్లా నాయకులూ ఏజె రమేష్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు జలీల్, ఐఎఫ్టియు, టియుఎల్ఈ జిల్లా నాయకులు సంజీవ్ ఏడుకొండలు ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, ఎస్ వి రమణమూర్తి, గెద్దాడు నగేష్, బందారు మల్లయ్య, భూక్యా శ్రీనివాస్, సిఐటీయు నాయకులు భూక్యా రమేష్, బాలకృష్ణ, బాలరాజు, ఐఎన్టియుసి నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమ, అభివృద్ధే లక్ష్యం: సిఐ

విశాలాంధ్ర - పినపాక: ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి పోలీసుల లక్ష్యమని ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పినపాక మండలం చింతలపాడు వలస ఆదివాసి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులకు విద్య, అసాంఘిక వ్యక్తులకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించారు. వలస ఆదివాసీల బహుముఖ అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ఆదివాసీ ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలను అందించెందుకు పోలీస్ శాఖ విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత, పిల్లలు విద్య ద్వారానే వ్యక్తిగత జీవితాల్లో మార్పు వచ్చి ఉన్నత స్థానాలకు చేరుకుంటారని సిఐ అభిప్రాయపడ్డారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆ గ్రామంలోని పిల్లలకు పలకలను అందించారు. పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ వహించి చదివించాలని తండ్రి తల్లిదండ్రులకు ఆయన సూచించారు.

సంపాదకీయం

మోదీ తెచ్చుకునే అవార్డులు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు చేయడమేకాదు అనేక దేశాల నుంచి అవార్డులు కూడా మోసుకొస్తున్నారు. తాజాగా దక్షిణాఫ్రికాలోని ఘనా తమ దేశంలో అత్యున్నత అవార్డు మోదీకి ప్రదానం చేసింది. అంతర్జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన, రాజనీతిజ్ఞత ప్రదర్శించిన నాయకులకు ఇతర దేశాలు తమ దేశంలోకెల్లా అత్యున్నత అవార్డులు ప్రదానం చేయడం రివాజు. కానీ ఈ రెండు అంశాలలోనూ గత పదకొండేళ్లుగా మోదీ కీలక పాత్ర పోషించిన దాఖలాలు లేవు. శీతోష్ణ స్థితి సమస్య ప్రస్తుతం అన్ని దేశాలనూ కలచి వేస్తోంది. ఇజ్రాయిల్ గాజాపై 20 నెలలుగా దాడి చేస్తోంది. రష్యా-ఉక్రేన్ యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇజ్రాయిల్ ఇటీవలే ఏకపక్షంగా ఇరాన్ మీద విరుచుకుపడింది. ఈ ఘర్షణలను నివారించడంలో మోదీ చూపిన సామర్థ్యం ఎక్కడా కనిపించడం లేదు. ఉగ్రవాద దేశమైన ఇజ్రాయిల్‌ను సమర్థిస్తున్నప్పుడు ఘర్షణ నివారించడానికి మోదీ ప్రభుత్వం నైతిక బలం కోల్పోయింది. ఇరాన్‌తో మనకు దీర్ఘకాలంగా సంబంధాలు ఉన్నా, అనేక సార్లు మన దేశానికి మద్దతు ఇచ్చినా మోదీ ఇరాన్ పక్షాన నిలబడనే లేదు. పైగా ఆక్రమణదారైన ఇజ్రాయిల్ వేపే నిలబడ్డారు. శీతోష్ణస్థితి పరిరక్షణకు మోదీ చేసిన ప్రత్యేక కృషి ఏమీ కనిపించదు. ఇజ్రాయిల్ గాజా మీద యుద్ధం ప్రారంభించి ప్రారంభించక ముందే మోదీ హమాస్ మీద దుమ్మెత్తి పోశారు. ఇప్పటికీ పలస్తీనా మీద ఇజ్రాయిల్ అమానుషమైన దాడులు చేస్తూనే ఉంది. పసి పిల్లలను, అన్నార్తులను బాంబులు వేసి హతమారుస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతోంది. అయినా మోదీ కిమ్మనరు. పలస్తీనా ప్రజల అస్తిత్వ పోరాటాన్ని మన దేశం దశాబ్దాల పాటు సమర్థించింది. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత తీవ్రవాద దేశమైన ఇజ్రాయిల్‌ను సమర్థించడం మొదలు పెట్టింది. మోదీ అధికారంలోకి రాక ముందు విదేశాంగ విధానంపై మన దేశంలో ఏకాభిప్రాయం ఉండేది. దాన్ని మోదీ చిందరవందర చేశారు. అమెరికా వత్తాసుదారుగా వ్యవహరిస్తున్నారు. అందుకే పహల్గాం సంఘటన తరవాత పాకిస్థాన్‌లోని తీవ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని చెప్పుకుంటున్నారు. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచన లాంటి ఆదేశం రాగానే అమాంతం పాకిస్థాన్‌ను లొంగదీసే అవకాశం వదులుకున్నారు. అయినా ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామని, ఆపరేషన్ సిందూర్‌కు విరామమే ఇచ్చాం తప్ప సంపూర్ణ కాల్పుల విరమణ జరగలేదని వితండవాదం చేస్తున్నారు. అంటే మరోసారి పాకిస్థాన్ తీవ్రవాదులను మన దేశంలోకి పంపించేదాకా, వారు పుల్వామా, పహల్గాం లాంటి ఘాతుకాలకు పాల్పడితే తప్ప మోదీ మిన్నకుంటారు కాబోలు. ఘనా మోదీకి తమ దేశంలోకెల్లా అత్యున్నత అవార్డు ఇచ్చి ఉండొచ్చు. దానికి బీజేపీ, ఆ పార్టీ నెలకొల్పిన ఐ.టి.విభాగం ఎగిరి గంతులు వేస్తూ ఉండొచ్చు. కానీ మోదీ వెళ్లక ముందు ఆయనకు ఈ సత్కారం అందజేస్తున్నట్టు ఘనా ఎందుకు ప్రకటించలేదు? మోదీకి ఈ సత్కారం అందజేయకూడదని ఘనాలో చాలా మంది గొంతెత్తి అరిచారు. ఘనా దక్షిణాఫ్రికాలో చాలా చిన్న దేశం. దీనివల్ల మోదీ తన కీర్తిని చాటి చెప్పుకుని దండోరా వేసుకోవడానికి ఓ సందర్భం ఏర్పడి ఉండొచ్చు. కానీ ఇది మహత్తరమైన అవార్డు ఏమీ కాదు. ఘనా లాంటి చిన్నా చితక దేశాలకు భారత్ అవసరం ఉంటుంది. పెట్టుబడులు కావాల్సి ఉంటుంది. ఘనాలో అదానీ ఏ మేరకు పెట్టుబడులు పెట్టగలుగుతారో కొద్ది రోజుల తరవాత కానీ బయట పడదు. పెట్టుబడులు పెట్టడానికి అదానీ ఉత్సాహం ప్రదర్శిస్తున్న మాట మాత్రం నిజం. అదానీ పెట్టుబడుల కోసం మోదీ చేసిన ప్రయత్నం ఏమిటో కూడా కొద్ది కాలం తరవాతగానీ తెలియదు. ప్రధానమంత్రి మోదీ ఏ విదేశీ యాత్రకు వెళ్లినా కొద్ది నెలల ముందే దౌత్య స్థాయిలో చాలా సంప్రదింపులు జరుగుతాయి. మోదీకి పురస్కారం ఇస్తామని ఘనా ముందే ప్రకటించలేదంటే దీనికోసం మన విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎన్ని పాట్లు పడాల్సి వచ్చిందో!

కాంగో, రువాండా, లాటిన్ అమెరికా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలోనూ మోదీ పాత్ర కాగడా పట్టుకుని వెతికినా కనిపించదు. ఏ దేశం వెళ్లినా మోదీ ప్రధానంగా చేసే పని అక్కడి ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించడమే. ఇవన్నీ ఆయన పలుకుబడి పెంచుకోవడానికి ఉపకరించేవే తప్ప మన దేశానికి ఒరిగేదేమీ లేదు. మోదీ హయాంలో ఆయన ఎడా పెడా చేస్తున్న విదేశీ యాత్రలవల్ల ఒరుగుతున్నది శూన్యమే. మన పాస్ పోర్టుకు విలువ లేకుండా పోయింది. వివిధ దేశాల పాస్‌పోర్టులకు ఉన్న విలువను తెలియజేసే 180 దేశాల జాబితాలో మనం 148వ స్థానంలో ఉన్నాం. ఈ స్థానానికి దగ్గరలో ఉన్నది అనామక దేశం కొమరోస్ మాత్రమే. మొజాంబిక్ ఒక మెట్టు పైకి ఎక్కగలిగింది. మన పాస్‌పోర్టు విలువ దిగజారుతూనే ఉంది. మన పాస్‌పోర్టుకు విలువ లేనప్పుడు మోదీ ఎన్ని సత్కారాలు ఏర్పాటు చేయించుకుంటే మాత్రం ప్రయోజనం ఏమీ ఉండదు. ఇటీవలే మాలీలో పని చేస్తున్న ముగ్గురు భారతీయులను తీవ్రవాదులన్న ఆరోపణతో బంధించారు. మూడు రోజులైనా వీర్ని విడుదల చేయనే లేదు. మన విదేశాంగ మంత్రిత్వ శాఖ వారిని విడిపించే క్రమంలోనే ఉందట. ఇటీవల క్వాడ్ సమావేశం జరిగినప్పుడు పహల్గాం మీద ఉగ్రవాద దాడిని ఖండించారు కానీ పాకిస్థాన్ ప్రమేయాన్ని ప్రస్తావించడానికి నిరాకరించారు. బెలూచిస్థాన్‌లో భారత్ ఆగడాలను మాత్రం సంయుక్త ప్రకటనలో ప్రస్తావించారు. అలాగే షాంఘై సహకార సంఘంలో కూడా పహల్గాం ఘాతుకం వెనక పాక్ ప్రమేయం ప్రస్తావనే లేదు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సిద్ధం చేసిన ప్రకటనలో మొదట పాకిస్థాన్ పేరెత్తారు కానీ ఆ తరవాత ఒత్తిడివల్ల ఆ మాట తొలగించవలసి వచ్చింది. పహల్గాం ఘాతుకాన్ని ఇతర దేశాలు ప్రత్యక్షంగా ఖండించకపోవడానికి ఆ దేశాలకు పాకిస్థాన్ మీద ఉన్న అమితమైన అభిమానం కారణం కాదు. పాక్ ప్రమేయాన్ని నిరూపించడానికి సమగ్రమైన, నమ్మదగిన సమాచారం అందించడంలో మన విదేశాంగ శాఖ విఫలమైంది. 2008 నవంబర్ 11న పాకిస్థాన్ తీవ్రవాదులు బొంబయిలో విరుచుకుపడడంవల్ల వందలాది మంది మరణించారు. కానీ అప్పుడు ఆ తీవ్రవాదుల ఆచూకీ కనిపెట్టగలిగాం. పహల్గాం ఘాతుకానికి కారణమైన తీవ్రవాదులు ఎవరో తమకు తెలుసునంటొంది ప్రభుత్వం. కానీ ఇంతవరకు ఒక్కరినైనా పట్టుకోలేదు. ఆపరేషన్ సిందూర్‌లో పెద్ద తీవ్రవాదులెవరైనా మరణించిన దాఖలాలూ లేవు. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసినంత మాత్రాన ఫలితం ఏమీ ఉండదు. పాకిస్థాన్ మళ్లీ అలాంటివి ఏర్పాటు చేయడానికి ఎటూ సహకరిస్తుంది.

ఓ ఆత్మహత్య... రెండు హత్యలు

పుట్టెడు అవసరం లేదు! చిటికెడు ప్రేమ కావాలి. తినిపించనవసరం లేదు. తిన్నావా అన్న మాట చాలు. ఏకాకి బతుకుల కోసం సమస్త కాకులూ ఎదురుచూస్తాయి. లేరని తెలిశాక భోరుమనడం కాదు. ఉన్నప్పుడు ఎలా ఉన్నావన్న పలకరింపు కావాలి. ఒంటరితనపు శాపం. కలలోనూ వదలని వేదన. కళ్ల ముందే కదలాడుతూ భయపెట్టే వెన్నెల. ఒంటరి కోయిలకు పాటల రాగాలాపన తెలియదు. జంట పక్షులకు విడిపోతామన్న స్పృహ ఉండదు. ఒంటరి పక్షికి కళ్ల ముందు కదలాడే శశ్మానం. విలాసవంతమైన నిర్భాగ్య జీవితంలో నిత్యం ఎదురుపడని గుప్పెడు మెతుకులు. ముద్ద గొంతులో దిగుతూనే ఒంటరితనం పొలమారుతుంది. ఆమె గుర్తుకొచ్చిందా... అతడు తలచుకుంటున్నాడా... ఎవరి నెత్తి మీద వారే ఎడమ అరచేతితో కొట్టుకోవాలి. పొలమరింతకు నిజం తెలియదు. ప్రతి పూట అన్నం ముద్దకు వెదుకులాట భయం. బికారి జీవితానికి ఎడారి ఏకాంత వాసం. వేధింపుల జైలులో బందీ అయిన "స్వేచ్ఛ". తనను బాధిస్తున్న మగ ప్రపంచపు ముల్లుని పీకి పారేసి ఆ యాంకర్ చకచకా నడుచుకుంటూ వెళ్లిపోయింది. ఆమె అడుగులు సరైన దిశగానే వెళ్లాయో...!? లేదో..!? చర్చించుకుంటాయి వెనక్కి తిరిగిన పాదాలు. పది రోజుల పాటు స్వేచ్ఛ అకాల మరణంపై సంతాపం. ఎవరి జీవితాలు వారివన్న సందేశాలు గుర్తుకొస్తాయి. ఇక ఉదయాన్నే భుజాన సంచీ వేసుకుని ఎవరి బతుకు పోరాటం వారిదే. కొన్నాళ్ల తర్వాత మరో ఊపిరి ఆగిపోతుంది. స్త్రీదే కావచ్చు.. పురుషుడిదైనా కావచ్చు. ఫేస్‌బుక్‌లో మళ్లీ సంతాపాలు. పట్టువదలని విక్రమార్కుడు మళ్లీ చెట్టు దిగుతాడు. ఈసారి అతని రూపం

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

మారుతుంది. బహుశా పేరు కూడా కొత్తగా వినిపిస్తుంది. ఆరడుగుల గొయ్యో, కట్టెలు పేర్చిన జీవితపు చివరి మంచమో రారమ్మని పిలుస్తుంది. మట్టి ప్రేమగా మాటాడుతుంది. కట్టే హాయిగా కౌగలించుకుంటుంది. మట్టికి, నిప్పుకి అవినాభావ సంబంధం. పంచభూతాలలో మట్టి, నిప్పుశాశ్వత మిత్రులు. గుండె కొట్టుకోవడం ఆగిపోతే మరణం. జీవిస్తూ కూడా గుండె లయ తప్పడం జీవన్మరణం. ఎవరి శ్వాస వారి దగ్గరుండదు. ముక్కు ఓ అవయవం. ముక్కుపుటాలు మాత్రం ఎదుటి వారి ఆధీనం. శ్వాస తీయడం, ఆపేయడం యోగలో శిక్షణ. నీ శ్వాసని ఆపేయడం వారి సాధన. అతను చిరునవ్వుతాడు. నవ్వు వెనుక చావుల కుట్రలుంటాయి. స్వేచ్ఛ కదా పేరు. అతను అదే అనుకుంటుంది వెర్రిబాగుల్ది. కూతురి రోదనకు అరణ్యం దారి చూపిస్తుంది. ఈ విషయం తెలియక కాదు. ఇంత తెలిసియుండి ఈ గుణమేలరా అంటుంది ఫేస్ బుక్. తెలియకపోవడం నేరం కాదు. తెలిసీ చీరని తాడుగా చేసుకోవడమూ నేరం. ఛీత్కారాలకు చీరలు అంతిమ వాక్యం పలుకుతాయి. స్వేచ్ఛ లేని చోట ఆ పేరును ఉరేసింది పిచ్చి తల్లి. ఆమె శాశ్వతం. స్వేచ్ఛ మాత్రమే అశాశ్వతం. ఆ తొమ్మిదో నంబర్ గుహలో ఒక్కసారే పరిచయం. మూడంటే మూడు నిమిషాల సంభాషణ. నా ఈనాటి స్థితికి తాను పలికిన ఓదార్పు. నేడు నేను చెబుతున్న వీడ్కోలు. అసలు తెలియకపోయినా ఈ నా కన్నీరు ఆగదు. ఒక మనిషి మరణించడమంటే మానవత్వం ఊపిరి బిగపట్టడం అని కదా చదువుకున్నాం... ఆగిపోయిన స్వేచ్ఛ ఊపిరికి ముక్కుపుటాలు పైకెగేస్తున్న శోకం.

ఈ బతుకులు ఇంతేనా... మూడు రోజుల వ్యవధి. ముగ్గురు జర్నలిస్టుల ఆగిన గుండె. ఇంగ్లీషులో అనుకుంటాం. హార్ట్ ఎటాక్. తెలుగులో మాత్రం అది ముమ్మాటికీ హత్యే. యువకుల గుండె గట్టిదా..! ఎందుకు ఆగుతోంది. ప్రశ్నలు. ప్రశ్నలు. ఒక్కటే జవాబు. డబ్బులు.. డబ్బులు. గుండెకు తెలిసింది లబ్... డబ్... లబ్.. డబ్... యాజమాన్యాలకు తెలిసింది రెండో పదమే. అదే డబ్.. డబ్. నిన్నటి దాక అతను వార్తలు రాసే విలేకరి. ఈ రోజు హఠాత్తుగా అతడే ఓ వార్త. మొన్న ఈ కథనం రాయమని చెప్పిన వారే నేడు అతడ్ని సింగిల్ కాలమ్‌లో బంధిస్తారు. భార్య ఏడుస్తుంది. పిల్లలు దిక్కులు చూస్తుంటారు. యాజమాన్యపు కారులోంచి ఓ పెద్దాయన దిగుతాడు. "మిమ్మల్ని ఆదుకుంటాం. అందాకా ఇది ఉంచండి అంటుంది" ఆ అధికారం. అక్కడే బాధకు నటించడం వచ్చు అని తెలుస్తుంది. మహానటుడి కారు వెనుతిరుగుతుంది. కొన్నాళ్లకు ఆ కలం వీరుడి భార్య పనిమనిషో, టైలరో, బీడీలు చుట్టే స్త్రీనో, కర్రీ పాయింట్ నిర్వాహకురాలిగానో కనిపిస్తుంది. ఎందుకో బిడ్డల ఒంటి మీద బట్టలకు చిరుగులుంటాయి. ఎన్నికలొస్తాయి. అకాలంలో కురిసిన వర్షాల్లా జర్నలిస్టులపై వరాల జల్లు కురుస్తుంది. ఆ జల్లులు ఒక్కోసారి తుపానుగా మారి ఇంటి స్థలాలవుతాయి. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు ఐదు లక్షల తక్షణ సాయమంటాయి. వాళ్లు, వీళ్లు అని కాదు. ఆ పార్టీ, ఈ పార్టీ అని కూడా కాదు. అందరూ జర్నలిస్టులకు దారి చూపే చుక్కాని అవుతామంటారు. ఎన్నికలయ్యాక చుక్కానికి చిరుగులుంటాయని ఈ జర్నలిస్టులు తెలుసుకోరు. కసాయిలను నమ్మడం అనే మాటకు అర్థం తెలుస్తుంది. ఈ లోగా పుణ్యకాలం గడిచిపోతుంది. మరొకరి గుండెపై ఎటాక్ జరుగుతుంది. పిచ్చి గుండె తట్టుకోలేక ఆగుతుంది. అందరిలాగే వీరికి సంఘాలుంటాయి. పోరాటాలుంటాయి. మంత్రులకు వినతి పత్రాలుంటాయి. అతగాడి పెద కర్మ తర్వాత ఆ భార్యాబిడ్డల జీవితాలను నిత్యం ఓ ఖర్మ వేధిస్తూ ఉంటుంది. ఐదేళ్లు గడుస్తుంది. మళ్లీ ఎన్నికలొస్తాయి. ఇళ్ల స్థలాలకు, లక్షల హామీలకు మెలకువ వస్తుంది. ఒళ్లు విరుచుకున్న అబద్ధం ఈసారి నిజం చేస్తానంటుంది. నమ్మకం మనిషిని మోసం చేస్తుంది. జర్నలిస్టులను రోడ్డుకీడుస్తుంది. ప్రతి ఏటా పాఠశాలలు తెరుస్తారు. ఫీజులు తలుపులు తడతాయి. బిడ్డ పెళ్లికి ఎదుగుతుంది. పెళ్లయిన కూతురు ఈ భూమి మీదకు మరో జన్మను తీసుకొచ్చేందుకు ఇంటికి వస్తుంది. బ్యాంకు బ్యాలన్స్ వెక్కిరిస్తుంది. సరిగ్గా అప్పుడే పెద్ద సారు నుంచి ఫోన్ వస్తుంది. ఈ నెల ప్రకటనల టార్గెట్ పూర్తి చేయమని ఆర్డరిస్తుంది. ఇదిగో ఇప్పుడే గుండె కలుక్కుమంటుంది. ఫెటిల్మని పేలుతుంది. జర్నలిస్టు వృత్తిలో ఇన్నాళ్లూ పట్టని నిద్ర ఆ రోజు హాయిగా పడుతుంది. గుండెలు అలసిపోయి ఆవలిస్తాయి. నోరు కాదు కాదా ఆవలించింది. గుండె కదా. శాశ్వతంగా నిద్రపోతుంది.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

మత సామరస్యానికి సంఘపరివార్ చిచ్చు

టీ.ఎం.మారుతి

తమిళనాడులో ఆర్ఎస్ఎస్ ఎలాగైనా తిష్టవేసి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం మత సామరస్యానికి చిచ్చు పెట్టేందుకు సిద్ధపడింది. తమిళనాట అనేక శతాబ్దాలుగా మురుగన్‌ను పూజించే సంప్రదాయం ఉంది. మధురైలో తిరుప్పన్ కుంద్రం కొండపై దృష్టిని కేంద్రీకరించి ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా నెలకొని ఉన్న మతాల మధ్య సామరస్యానికి చిచ్చుపెట్టే కార్యక్రమం ఆర్ఎస్ఎస్ ప్రారంభించింది. చరిత్రలో తమిళనాట రాముడిని సైతం పూజిస్తున్న సంప్రదాయం లేదు. తొలి నుంచి మురుగన్‌నే పూజిస్తున్నారు. ప్రాచీన కాలం నుంచి తమిళనాడులో భూమిని ఐదు రకాలుగా విభజించారు. అవి కురింజి (పర్వతాలు), 'ముల్లయ్' (అడవులు), మారుథమ్ (వ్యవసాయ భూములు), నైథల్ (తీరప్రాంతం), సారవంతం కోల్పోయిన ప్రాంతాలు (ఎడారి ప్రాంతం). దీన్ని 'పలై' అని పిలుస్తారు. స్థానిక సామెత ఒకటుంది. "కొండలు ఎక్కడ ఉన్నాయో, అక్కడ కుమరన్ (మురుగన్) ఉంటారు. తిరుప్పరన్ కుంద్రతో ఆరు పవిత్రమైన ఎత్తయిన కొండలపైన గల మురుగన్‌గా పరిగణించారు. తమిళనాడులో మత, సాంస్కృతికతను 20 లక్షల ఏళ్లుగా గుర్తించారు.

2025 జూన్ 22 న మధురైని తమిళనాడు సాంస్కృతిక కేంద్రంగా గుర్తించి సంఘ పరివార్ మురుగన్ దేవతల సదస్సును నిర్వహించింది. 'మురుగన్ పవిత్రమైన ఎత్తయిన కొండలపైగల ప్రాంతాలను ఆలయాల టవర్ల ముఖ ద్వారాలుగా పరిగణించారు. చలన చిత్రాల సెట్స్‌ను పోలినట్లుగా రూపొందించారు. మధురైని వ్యూహాత్మకంగా ఎన్నుకున్నారు. తిరుప్పరన్ కుంద్రన్ కొండకు ఆరు కిలోమీటర్ల దూరంలో గల మధురైని 23000 ఏళ్లుగా మత సాంస్కృతిక కేంద్రంగా గుర్తించారు. తిరుప్పరన్ కుంద్రం మత వైవిధ్యం గల సూక్ష్మ జగత్తు. కొండపైన జైన్‌ల పడకలను, బీసీఈలో మొదటి శతాబ్ది నాటి పలె శిల్పాలను తయారుచేశారు. ఎనిమిదవ శతాబ్ది నాటి మురుగన్ ఆలయం (మొదట జైన్ ఆలయంగా విశ్వసించారు.), 16 వ శతాబ్ది పాలకులు కాశీవిశ్వనాథ ఆలయంగా అనంతరం సికిందర్ బాద్‌షా దర్గాగా విస్తరించారు.

వివిధ దశల చరిత్రలో కొండ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంతంగా పండుగలను, సంప్రదాయాలను వివిధ మతాల వారు కలిసి నిర్వహించు కున్నారు. మురుగన్ పండుగలను ఏడాది పొడవునా జరుపుకునేవారు. పండుగ సందర్భంగా లక్షలాది మంది హాజరై మురుగన్‌ని పూజించేవారు. అదే విధంగా ముస్లింలు ప్రతి సంవత్సరం 'సనందనకుడు' పండుగను జరుపుకునేవారు. పెద్ద సంఖ్యలో స్థానిక హిందువులు పండుగ వేడుకల్లో పాల్గొనేవారు. సంప్రదా యంగా కొండపైన మేకలు, కోళ్లను బలి ఇచ్చేవారు. మత భేదం లేకుండా అన్ని మతాల ప్రజలకు ఆహారం వండి వడ్డించేవారు. ఈ సంప్రదాయాలను పాటించడం, ముస్లిం దూషణని, మురుగన్ కొండలపై ప్రాంతాలను కలుషితం చేసేవారని, అందువల్ల ముస్లిం సంప్రదాయాలను రద్దు చేయాలని ఆర్ఎస్ఎస్ కోరుతోంది. కొండపైన దర్గాకు సమీపంలో మురుగన్ లాంప్‌ను వెలిగించేం దుకు అనుమతివ్వాలని ఆర్ఎస్ఎస్ కోరుతు న్నది. శతాబ్ది క్రితం కొండపైన ప్రాంతంలో యాజమాన్య హక్కుపై న్యాయపరమైన వివాదాలను సృష్టించింది. న్యాయపరమైన పిటిషన్ దాఖలు చేయగా వందలాది డాక్యుమెంట్లను లోతుగా చదివి, అలాగే సాక్షులను విచారించి కొండపై ప్రాంతం, దర్గా ముస్లింలకే చెందుతాయని 1926 లో

> ఆర్ఎస్ఎస్ ప్రకారం, సుబ్రహ్మణ్యస్వామి వేదకాలపు దేవుడు. తమిళ దేవుడు మురుగన్‌పైన వాళ్లు అధికుడిగా రుద్దారు. దాడులు జరిపి గొడవలు చేయడానికి మురుగన్ దేశీయ దేవుడన్నారు. మురుగన్ గిరిజనుల నాయకుడని తప్పనిసరిగా మాంసం తినే ఉంటాడని సంఘ పరివార్ ప్రచారం చేస్తున్నది. అనంతరం ఆయనను వేద దేవుడిగా మార్చారు.

మద్రాసు హైకోర్టు తీర్పు చెప్పింది. 1931 లో లండన్‌లోని ప్రీవి కౌన్సిల్ కూడా మద్రాసు హైకోర్టు తీర్పును ధృవీకరించింది. అయితే సంఘ పరివార్ గత దశాబ్ది కాలంగా ప్రదర్శనలు జరుపుతూ, దర్గాను తొలగించాలని, జంతు బలులను నిషేధించాలని కోరుతూ, సంఘ పరివార్ ఉద్రిక్తతలను సృష్టిస్తోంది. ఆలయం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ప్రదర్శన జరుపుకోవాలని కోర్టు ఉత్తర్వు జారీ చేసినప్పటికీ, తాజాగా ఇటీవల ఆర్ఎస్ఎస్ తిరుప్పరన్‌కుంద్రం మురుగన్ ఆలయం వద్ద బీజేపీ జెండాలను ఎగురవేస్తూ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శన పైన ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' సవివరమైన వ్యాసం ప్రచురించింది. తమిళనాడులో మురుగన్‌గా ఆరాధించే దేవత అసలు సుబ్రహ్మణ్యస్వామి అని ఆర్గనైజర్ ఆ వ్యాసంలో పేర్కొన్నది.

ఆర్ఎస్ఎస్ ప్రకారం, సుబ్రహ్మణ్యస్వామి వేదకాలపు దేవుడు. తమిళ దేవుడు మురుగన్‌పైన వాళ్లు అధికుడిగా రుద్దారు. దాడులు జరిపి గొడవలు చేయడానికి మురుగన్ దేశీయ దేవుడన్నారు. మురుగన్ గిరిజనుల నాయకుడని తప్పనిసరిగా మాంసం తినే ఉంటాడని సంఘ పరివార్ ప్రచారం చేస్తున్నది. అనంతరం ఆయనను వేద దేవుడిగా మార్చారు. దీంతో ఆయన శాఖాహారి అయ్యారు. 2025 జూన్ 4 వ తేదీన మద్రాసు హైకోర్టు మధురై బెంచి తీర్పు చెప్పింది. హిందూ సంప్రదాయాల ప్రకారం కొంతమంది జంతు బలులను ఇచ్చేవారు. అయినప్పటికీ మతాల మధ్య సామరస్యం ఉంటుందని జడ్జి నిషాబాను తీర్పు చెప్పారు. తిరుప్పకరన్‌కుంద్రం వద్ద శాంతిని, సామరస్యతకు భంగం కలిగించే వ్యక్తులు, సంఘాలపై చర్యలు తీసుకోవాలని జడ్జి నిషాబాను ఆదేశించారు. ఇందుకు భిన్నంగా జడ్జి శ్రీమతి తీర్పు చెప్పారు. కొండపైన దర్గా వద్ద జంతు బలులను ఇచ్చినట్టు ఎలాంటి సాక్ష్యాలు లేవని తీర్పు చెప్పారు. తిరుప్పరన్‌కుంద్రం వద్ద వివాహ వేళల్లో ఏనాడు మాంసాహారాన్ని అనుమతించకుండా ఆలయ పవిత్రతను కాపాడేవారని శ్రీమతి అన్నారు. అంతేకాదు అన్ని కుటుంబాలలో మాంసాహారాన్ని భుజిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తిరుప్పరన్‌కుంద్రం కొండపైన స్థానిక దేవతలున్నారని, అలాగే జంతు బలుల సంప్రదాయం ఉండేదన్నారు. ఒకవేళ పూర్తిగా తప్పనిసరి జంతుబలులపైన నిషేధం విధించినట్లయితే అది ముస్లింలకు, హిందువులకు కూడా వర్తిస్తుంది కదా అన్నారు.

తమిళనాడులో 98 శాతం ప్రజలు మాంసం తింటారు. మిగతా 2 శాతం ఉన్నత కులాల హిందువులు మాంసాహారం తినడం పాపమని కింద కులాల వారే తింటారని మాట్లాడుతున్నారు. ఇద్దరు జడ్జిలు భిన్నమైన తీర్పు ఇచ్చారు. అయితే మరో జడ్జిని సంప్రదించాలని కోరారు. తీర్పు ఎలా ఉన్నప్పటికీ తిరుప్పరన్‌కుంద్రం ప్రజలు అలాగే తమిళనాడు ప్రజలు ఏనాడు సామాజిక సామరస్యతకు భంగం కలిగించలేదు. తమిళనాడు అసెంబ్లీకి పదినెలలకు లోపే ఎన్నికలు జరగ నున్నాయి. ఈ నేపథ్యంలో సహేతుకమైన చర్చను చేయడానికి బీజేపీకి ఇష్టం లేదు. మళ్లీ తమ పాత అలవాటుతో మత విభజనకు పూనుకున్నది. సెక్యులర్, ప్రగతిశీల శక్తుల కూటమితో తలపడే శక్తి మతోన్మాదులకు లేదు. ఏ విధంగానైనా రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికే ఈ తతంగమంతా నిర్వహిస్తున్నారు. ఇది ఇలా ఉండగా బీజేపీతో కలిసిపోయిన ప్రతిపక్ష పార్టీ అన్నాద్రవిడమున్నేట్రకజగం గతంలో ద్రవిడియన్ల భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండేది. ప్రస్తుతం ఎన్డీఏ గూటికి చేరింది. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయ పన్ను శాఖలు ఏఐఏడీఎంకె నాయకుల ఇళ్లపై దాడులకు పూనుకోవ డంతో బీజేపీ వద్దకు చేరారు. మురుగన్ సదస్సు జరిగిన తరువాత "మురుగ వచ్చింది. ద్రవిడ బహిష్కరించబడింది" అనే నినాదాన్ని ఇచ్చారు. ద్రవిడ ఉద్యమాన్ని స్థాపించిన వారు పెరియార్, అన్నాదొరైలు. వీరు ఉద్యమాన్ని ఉవ్వెత్తున నిర్వహించారు. వారినిప్పుడు శత్రువుల్లాగా, ద్రోహుల్లాగా ఆర్ఎస్ఎస్ చూస్తోంది. ఇప్పుడు ఏఐఏడీఎంకె బీజేపీ కౌగిలిలోకి చేరిపోయింది. జాతీయ స్థాయిలో సహేతుకమైన చర్చలు చేపట్టవలసింది పోయి కులమత విభజనకు సంఘపరివార్ తలపెట్టింది. సానుకూలమైన చర్చలను చేపట్టక పోవడానికి మతోన్మాద గ్యాంగు మతం, కులం ఆధారంగా అల్లరి చేసేందుకు మురుగన్ అంశాన్ని తీసుకున్నారు. తమ పేరులో అన్నా, ద్రవిడ పదాలను పెట్టుకొన్న ఏఐఏడీఎంకె బీజేపీకి తలవంచి సంఘపరివార్ నిర్వహించిన సదస్సులో పాల్గొనడం అత్యంత దారుణం.

బీజేపీ లబ్ధి కోసం బనకచర్ల బలి!

వి. శంకరయ్య

గోదావరి బనకచర్ల అనుసంధాన పథకానికి తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు దగ్గర పోలికలున్నాయి. ఇంజినీరింగ్ కన్నా రెండు కూడా రాజకీయ ప్రేరేపితమైనవి. కాగా సాగునీటి వసతికి వేరే ప్రత్యామ్నాయాలున్నా కొందరి లబ్ధి కోసం ఇవి తెర మీదకు వచ్చాయి. కాళేశ్వరం నిర్మాణం జరిగిన మూన్నాళ్లకే మూలన పడితే బనకచర్ల అనుసంధానం పురిటిలోనే సంధి కొట్టింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో తమ పార్టీ రాజకీయ ప్రయోజనాలకోసం అటు కృష్ణానదీ జలాల వాటాల సందర్భంగానూ ఇటు గోదావరి జలాల అంశంలోనూ ఆంధ్రప్రదేశ్‌ను బలిపశువు చేసింది. లేకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ శాఖకు ప్రతిపాదనలు పంపితే దాని పరిధి ఎంత? ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే ప్రాంతాల్లో పర్యావరణ అంశాలకు విఘాతం కలిగినట్లయితే ఆ అంశాలను గుర్తించి నివేదిక ఇవ్వవచ్చు. లేదా ఒక్కముక్కలో కేంద్ర జలసంఘం అనుమతి వచ్చిన తర్వాత తాము ప్రతిపాదనలు పరిశీలిస్తామని తేల్చి చెప్పవచ్చు. కాని ముమ్మందు కేంద్ర జల సంఘం డీపీఆర్ ఆమోదించే సమయంలో లేవనెత్తే అంశాలను తెరమీదకు తెచ్చింది. తాజాగా కేంద్ర జలసంఘం కూడా పెద్ద బాంబు పేల్చింది. చాంతాడంత యక్ష ప్రశ్నలు సంధించి వీటికి సమాధానాలు సమర్పించమని కోరినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇందులో ముఖ్యమైనవి మూడు అంశాలు. వరద జలాలు అంటే ఏమిటి? వరద జలాలను ఎలా లెక్కిస్తారు? ఇవన్నీ అటుంచి ప్రధానమైన అవరోధం ఒకటి తెర మీదకు తెచ్చింది.

సాగునీరు బహుళార్థ సాధక ప్రాజెక్టుల డీపీఆర్‌లు రూపొందించే సమయంలో కొన్ని మార్గ దర్శకాలు వున్నాయని ఏదైనా ప్రాజెక్టును పరిశీలించాలంటే నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన విధంగా 75శాతం నీటి డిపెండబిలిటీ వుండి తీరాలి. ఈ పరిస్థితుల్లో బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయింపులుపోగా ఏ మేరకు వరద జలాలు వుంటాయో లెక్కలు తేల్చమని కేంద్ర జల సంఘం ఆదేశించింది. ఈ షరతుతో వరద జలాలు కాదు కదా! మిగులు జలాలు కూడా గోదావరిలో లేవు. ఎందుకంటే జాతీయ జల అభివృద్ధి సంస్థ చేపట్టిన గోదావరి కావేరి అనుసంధానం పథకం సందర్భంగా కేంద్ర జలసంఘం గోదావరిలో మిగులు జలాలు లేవని ఇది వరకే తేల్చి చెప్పి వుంది. అది కూడా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలే కాకుండా బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల వినియోగం సమర్పించాలని కోరింది. సాగునీటి రంగంలో ఏమాత్రం పరిచయం వున్నవారు ఈ షరతుతో బనకచర్ల అనుసంధానం గురించి ఏం జరుగుతుందో ఊహించగలరు. ఆదిలోనే తెలంగాణలోని అధికార, ప్రతిపక్షాలకు పర్యావరణ శాఖ తాజాగా కేంద్ర జల సంఘం పదునైన అస్త్రాలను అందించాయి. తొలి నుంచి అనుమానిస్తూనే వున్నాం. ఆంధ్రప్రదేశ్ కన్నా తెలంగాణలో బీజేపీకి రాజకీయ ప్రయోజనాలు ఎక్కువ. మొన్న పార్లమెంటు ఎన్నికల్లో బలమైన శక్తిగా అవతరించింది. రానున్న శాసనసభ ఎన్నికల తర్వాత సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అనువైన వ్యూహాలు అమలు చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత శక్తి వంతుడైనా తెలంగాణాకు వ్యతిరేకంగా ఏకపక్షంగా బనకచర్లకు అనుమతి వస్తుందని ఎవరూ ఊహించ లేదు. ఇప్పుడు తెలంగాణలోని అధికార, ప్రతిపక్షాలు మరింతగా ప్రతిఘటించేందు అవకాశం ఏర్పడింది.

కృష్ణానదీ ట్రిబ్యునల్ అంశంలో కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గొంతు కోసింది. జగన్‌మోహన్ రెడ్డి బలిపీఠం ఎక్కిస్తే కేంద్ర ప్రభుత్వం మూడేళ్లుగా దస్త్రాలకే పరిమితమైన ట్రిబ్యునల్ ప్రతి పాదనను ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసం బయటికి తీసి నియామకం చేసింది. ఇప్పుడు పరోక్షంగా గోదావరి వరద జలాల ఉపయోగానికి స్పాట్ పెట్టింది. బనకచర్ల అనుసంధానం అటుంచగా గోదావరి పెన్నా అనుసంధానానికి అడ్డుకట్ట పడింది. ఫలితంగా పోలవరం నీళ్ల కృష్ణా ఆయకట్టుకు వాడుకోగా మిగిలిన నీళ్ల రాయలసీమకు ఇచ్చే అవకాశం మూసుకు పోయే ప్రమాదం ఏర్పడింది. బనకచర్ల అనుసంధానం పథకం అంతర్ రాష్ట్ర జల వివాదంతో కూడినదనీ, అపెక్స్ కౌన్సిల్ మెడ మీద కత్తిలా వుందని పైగా ఒకరికొకరు పోటీపడి తెలంగాణ నుంచి తీవ్ర ప్రతిఘటన వుంటుందన్న సాకుతో కేంద్రం మొండి చేయి చూపవచ్చని అనేక మంది చెప్పినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవేవీ పరిగణనలోకి తీసుకోలేదు. అంటే కేంద్ర ప్రభుత్వంపై గట్టి నమ్మకం పెట్టుకొన్నారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల ముందు ఇలాంటివన్నీ బలాదూర్ అని గతంలో ఎన్నో నిదర్శనాలున్నాయి. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర జల వనరుల శాఖాధికారులు ఏ విధంగా ఆలోచిస్తున్నారో ఏమో గాని ఆంధ్ర ప్రదేశ్‌కు ఏదో ఒరగబెడుతున్నట్లు అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కించిత్తు కూడా మెత్తబడే అవకాశం లేదు. రేవంత్‌రెడ్డి ఒక సెంటీమీటర్ కిందకు దిగితే ఆయన కాళ్లు కిలోమీటర్ వరకు లాగేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా వుంది. వారికి కావలసినంత ఇంధనం కేంద్ర పర్యావరణ శాఖ కేంద్ర జల సంఘం ఇచ్చి వున్నాయి. నేడు తెలంగాణలో అధికార ప్రతిపక్షాల మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోంది. రానున్న శాసనసభ ఎన్నికల వరకు దీన్ని సాగలాగేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా వుంది. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపైనొకటి దుమ్మెత్తి పోసుకుంటున్నాయి.

గతంలో రేవంత్‌రెడ్డికి టీడీపీతో వున్న సంబంధాలను ఆయుధంగా మాజీమంత్రి హరీశ్‌రావు ప్రయోగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ గతంలో వ్యవహరించిన తీరును జగన్‌మోహన్ రెడ్డితో నెరిపిన స్నేహాన్ని తదితర పాత సంఘటనలు ఉల్లేఖిస్తున్నారు. గోదావరిలో తమకు వెయ్యి టీఎంసీలు, కృష్ణలో 500 టీఎంసీలకు ఆంధ్రప్రదేశ్ బ్లాంక్ చెక్కులాగా ఇస్తే బనకచర్ల పథకానికి ఆమోదం తెలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరవచ్చేమో. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అంశంలోనే కాకుండా వివాదమున్న ఏ నదీ జలాలను రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకొన్న దాఖలాలు లేదు. అయిదేళ్ల పరిపాలన చేయమని మాత్రమే ఎవరికైనా ప్రజలు అధికారం ఇస్తారు. శాశ్వతంగా నష్టదాయకంగా నిర్ణయాలు తీసుకొనే అధికారం ఇవ్వలేదు. అందునా నదీ జలాలు ఈ పద్ధతిలో పంపకాలు వుండవు. పైగా కేంద్ర జలసంఘానికి గాని కేంద్ర జలవనరుల శాఖకు తుదకు సుప్రీంకోర్టుకు అధికారం లేదు. 1956 అంతర్ రాష్ట్ర జల వివాద చట్టం వచ్చిన తర్వాత ట్రిబ్యునల్స్ వివాదాలను పరిష్కరించాలి. అంతెందుకు? కృష్ణానదీ జలాల వాటాలు తేల్చేందుకు ఇప్పుడు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ సాగిస్తున్నది కదా? మరీ ఒక పక్క ట్రిబ్యునల్ విచారణ తుదిదశకు వచ్చిన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల స్థాయిలో పంచుకుందామనే ప్రతిపాదన పెట్టారంటే ట్రిబ్యునల్ తీర్పు ఆ మేరకు ఇవ్వదనే కదా?

2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే గోదావరి ట్రిబ్యునల్ నియామకంపై కూడా తీర్మానం చేశారు. తదుపరి జగన్‌మోహన్ రెడ్డి పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆ ఊసే ఎత్త లేదు. రాష్ట్రాల మధ్య కీచులాటలు వుండాలనే ధోరణిలో కేంద్రం వుంటున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల రెండు రాష్ట్రాల వాటాలపై కేంద్ర జల సంఘానికి లేఖలు రాసినట్లు చెబుతున్నారు. ఇలాంటి అర్థంపర్థంలేని లేఖలు రాయడం బదులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే ట్రిబ్యునల్ నియామకంకోసం ఎందుకు ప్రయత్నం చేయలేదు. పోలవరం ప్రాజెక్టు, బనకచర్ల అనుసంధానం పథకాల కోసం కేంద్ర జల వనరుల శాఖ మంత్రిని అనేకమార్లు రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి కలిశారు. ఒక్క సందర్భంలో కూడా ట్రిబ్యునల్ ప్రస్తావన రాలేదు. 1980లో తీర్పు వచ్చినా గోదావరి ట్రిబ్యునల్ కృష్ణానదిలోలాగా ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయలేదు. గంపగుత్తగా కేటాయించినది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1486.85 టీఎంసీలు లభించాయి. ఇందులో తెలంగాణ తమ వాటా 957.85 టీఎంసీలని ఆంధ్రప్రదేశ్ వాటా 518 టీఎంసీలని చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ తమ వాటా 658 టీఎంసీలని తెలంగాణ వాటా 778 టీఎంసీలని చెబుతోంది. ఈ గణాంకాల నుంచే సరి సంఖ్యగా వుండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి టీఎంసీలకు టెండర్ పెట్టారు. అదే కృష్ణా ట్రిబ్యునల్‌లాగా గోదావరి ట్రిబ్యునల్ నియమించివుంటే ఈ రోజు కాకున్నా రేపయినా ఎవరి వాటా ఎంతో నిర్ధారణ అయ్యేది. రేపు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఒక అంగీకారం కుదరకపోతే కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతులెత్తేయడమే మిగులుతుంది. ఈ అస్తవ్యస్త పరిస్థితికి అందరూ బాధ్యులే.

విశ్రాంత పాత్రికేయులు

మా నిబద్ధతకు ఆపరేషన్ సిందూర్ నిదర్శనం: అమిత్‌షా

పూనె: దేశ సార్వభౌమాధికార రక్షణకు ప్రభుత్వం, సాయుధ దళాలు ఎంత నిబద్ధతతో ఉన్నాయో చెప్పేందుకు ఆపరేషన్ సిందూర్ అద్భుతమైన ఉదాహరణ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చెప్పారు. పూనెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ 'పీష్వా బాజీరావు స్మారకానికి ఎన్‌డీఏనే అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడే మన సైనిక నాయకత్వం శిక్షణ పొందుతోంది. మన స్వాతంత్ర్య సంగ్రామం శివాజీ మహారాజ్ నుంచే మొదలైంది. పీష్వాలు దానిని మరో 100 ఏళ్లు ముందుకు తీసుకెళ్లారు. ఇదే జరగకపోతే భారత దేశ ప్రాథమిక నిర్మాణం నిలిచిపోయేది' అని పేర్కొన్నారు. బాజీరావు తన 40 ఏళ్ల జీవితంలో ఎవరికి సాధ్యం కాని రీతిలో చరిత్ర సృష్టించారన్నారు. ఈ పర్యటనలో అమిత్‌షా నగరంలో జైరాజ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్‌ను ప్రారంభించారు.

'రోజూ రూ.1.25 లక్షల ఆదాయం' వీడియో నిజం కాదు: కేంద్రం

న్యూదిల్లీ: పెట్టుబడి పథకాల పేరుతో సైబర్ మాయగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్నట్టుగా డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించి అమాయకులను దోచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వీడియో కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయాలని పేర్కొంటూ మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో ఈ తరహా వీడియోలపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేవలం రూ.21 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజూ రూ.1.25 లక్షల ఆదాయం పొందేలా ఓ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ను ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్నట్లుగా ప్రసారమవుతున్న వీడియోలు నకిలీవని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ఈ వీడియోలు డిజిటల్‌గా వక్రీకరించినవని పీఐబీ తెలిపింది. ఇలాంటి పెట్టుబడి స్కీమ్ ఏదీ ప్రధాని గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ప్రవేశపెట్టలేదని తెలిపింది. ఏ వేదికతోనూ వారికి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ తరహా డీప్‌ఫేక్ వీడియోల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురికావొద్దని విజ్ఞప్తి చేసింది. ఇలాంటివి షేర్ చేసే ముందు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని కోరింది.

బీహార్‌లో పొత్తు కోసం లాలుకు ఎంఐఎం లేఖ

పాట్నా : రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లోని మహాఘట్బంధన్‌లో చేరడానికి అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఏఐఎంఐఎం సుముఖత వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఇందులో ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీ ఏకైక ఎమ్మెల్యే అయిన ఎంఐఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్, ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌కు అధికారికంగా మహా కూటమిలో చేరతామని అధికారికంగా అభ్యర్థిస్తూ లేఖ రాశారు. జులై 2న పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పంచుకున్న ఒక లేఖలో... బీహార్‌లో ఇండియా ఐక్య సంఘటనలో ఏఐఎంఐఎం చేరిక వల్ల 'లౌకిక ఓట్ల చీలికను నివారిస్తుంది' అని ఇమాన్ పేర్కొన్నారు. 'ఇది రాష్ట్రంలో తదుపరి ప్రభుత్వాన్ని మహాఘట్బంధన్ ఏర్పాటు చేస్తుందని నిర్ధారిస్తుంది' అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కూడా తన పార్టీ సంకీర్ణంలో చేరడానికి ప్రయత్నించిందని, ఈసారి ఆయన (ఒవైసీ) ఇప్పటికే కాంగ్రెస్, వామపక్ష నాయకులకు ఫోన్ ద్వారా' తన కోరిక వ్యక్తం చేశారని తెలిపారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఎంఐఎం ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ), ప్రస్తుతం ఎన్డీఏలో ఉన్న కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్ఎల్ఎస్‌పీ) తో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. ఎంఐఎం మొత్తం ఐదు సీట్లను గెలుచుకుంది. అన్నీ సీమాంచల్ ప్రాంతంలోనే, ఇక్కడ ముస్లిం జనాభా ఎక్కువగా ఉంది. అనేక నియోజకవర్గాలలో మహాఘట్బంధన్ ఓట్లను చీల్చివేసిందని చెబుతారు. ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాఘట్బంధన్, ఒక డజను సీట్ల మెజారిటీకి తగ్గింది. ఇమాన్ తప్ప ఏఐఎంఐఎం టికెట్లపై ఎన్నికయిన మిగిలిన ఎమ్మెల్యేలందరూ 2022లో ఆర్‌జేడీలో చేరారు.

వడోదరలో పాఠశాలలకు బాంబు బెదిరింపు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని వడోదరలో వివిధ పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా హర్ని ప్రాంతంలోని సిగ్నస్ స్కూల్‌కు శుక్రవారం ఉదయం ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు... బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాల ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కేవలం 12 రోజుల వ్యవధిలోనే బాంబు బెదిరింపులు రావడం నగరంలో ఇది మూడో ఘటన. బాంబు బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అన్ని బెదిరింపు మెయిల్స్ ఉమర్ ఫరూఖ్ అనే పేరుతో వస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రయత్నాలు ఫలించలేదు

సీఎం కుర్చీపై డీకే శివకుమార్

బెంగళూరు: కర్నాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పుపై జరిగిన చర్చకు తెరపడినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానం బుజ్జగింపులతో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ సర్దుకుపోవడంతో ప్రస్తుతానికి సమస్య తీరిపోయింది. అయితే సీఎం కావాలన్న తన కోరిక మిగిలే ఉందనే అర్థంలో డీకే తాజాగా వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ఆకాంక్షలపై మీడియా అడిగిన ప్రశ్నకు డీకే శుక్రవారం బదులిచ్చారు. 'ప్రయత్నాలు ఫలించకపోయినా.. నేను బలంగా కోరుకున్న దాని కోసం చేసిన ప్రార్థనలకు సమాధానం దొరక్కుండాపోదు. అయితే రాజకీయాల గురించి చర్చించే సందర్భం ఇది కాదు. రాష్ట్రానికి మంచి జరగాలి' అని తన ఆకాంక్షను నేరుగా బయటపెట్టకుండా డీకే సమాధానం చెప్పారు. మల్లికార్జున ఖర్గే తమకు జాతీయ అధ్యక్షుడని, ఆయన సూచనల ప్రకారం పార్టీ కోసం పనిచేస్తామని డీకే చెప్పారు. ఇటీవల కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మరో రెండు, మూడు నెలల్లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందన్నారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే.. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్దరామయ్య స్పష్టంచేయడంతో ఆ ఊహాగానాలకు తెరపడింది. 'ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు మరో మార్గం లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి' అని ఇంతకుముందు డీకే మీడియాతో మాట్లాడిన సంగతి తెలిసిందే. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. సిద్దరామయ్య, డీకే శివకుమార్ రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారని వార్తలు వచ్చాయి. పలు కేసుల్లో సిద్దరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తానని డీకే బహిరంగంగానే చెప్పిన సంగతి తెలిసిందే.

డీకే శివకుమార్‌కు ఉపశమనం

బెంగళూరు : పరువు నష్టం కేసులో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఉపశమనం లభించింది. 'అవినీతి రేటు కార్డు' ప్రకటనలపై బీజేపీ రాష్ట్ర విభాగం దాఖలు చేసిన ఈ కేసులో ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేయడం ద్వారా కర్నాటక హైకోర్టు శుక్రవారం శివకుమార్‌కు మధ్యంతర ఉపశమనం మంజూరు చేసింది.

ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కి కూడా కోర్టు ఇదే విధమైన ఉపశమనం కల్పించింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఆర్.కృష్ణకుమార్, ప్రతివాదికి నోటీసు జారీ చేసి... జులై 29న దానిని తిరిగి పొందేలా చేస్తూ, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతున్న చర్యలను సమర్థవంతంగా నిలిపివేశారు. 2023 కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ 'అవినీతి రేటు కార్డు' అనే పేరుతో వరుస వివాదాస్పద ప్రకటనలు జారీ చేసిన తర్వాత పరువు నష్టం కేసు తలెత్తింది. ప్రభుత్వ శాఖలలో నియామకాలు, బదిలీలు, స్థిరమైన 'రేట్లు', 'కమీషన్లు' తో వచ్చాయని పేర్కొంటూ, అధికారంలో ఉన్నప్పుడు అవినీతిని సంస్థాగతీకరించినట్లు ఈ ప్రకటనలు తప్పుడు ఆరోపణలు చేశాయని బీజేపీ ఆరోపించింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అప్పటి బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని 'ట్రబుల్ ఇంజిన్ సర్కార్' గా ప్రస్తావించడం, ఇది బీజేపీ లేదా ఎన్డీఏ తనను తాను 'డబుల్ ఇంజిన్ సర్కార్' గా వర్ణించుకోవడంపై ఒక రకమైన విమర్శ. కీలకమైన ఎన్నికలకు ముందు పార్టీ ప్రతిష్టను అపహాస్యం చేయడానికి, దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వక ప్రయత్నమని బీజేపీ వాదించింది. కేపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న డీకే శివకుమార్, అప్పటి ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య ప్రకటనలను అమలు చేయడానికి, ఆమోదించడానికి బాధ్యత వహించే వ్యక్తులుగా ఫిర్యాదు ప్రత్యేకంగా పేర్కొంది. రాహుల్ గాంధీ తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేయడం ద్వారా ఆరోపించిన పరువు నష్టం కలిగించే విషయాన్ని మరింత విస్తరింపజేశారని ఇది పేర్కొంది. ఈ సంవత్సరం ప్రారంభంలో, జనవరిలో, ఇదే కేసుకు సంబంధించి రాహుల్ గాంధీపై విచారణ చర్యలపై హైకోర్టు ఇలాంటి మధ్యంతర స్టే మంజూరు చేసింది.

ఎస్ఐఆర్ ఒక దుష్ట చర్య

లక్షలాది మంది ఓటు కోల్పోతారు

కాంగ్రెస్ విమర్శ

న్యూదిల్లీ: బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయే 'దుష్ట చర్య' అని, రాష్ట్రంలోని ఎన్నికల వ్యవస్థను 'నాశనం' చేయడానికి స్పష్టమైన ప్రయత్నమని కాంగ్రెస్ శుక్రవారం దుయ్యబట్టింది. ఎస్ఐఆర్ సమస్యపై బుధవారం ఇండియా ఐక్య సంఘటన పార్టీలకు చెందిన అనేక మంది నాయకులు దాని సమయంపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ భారీ కసరత్తు ద్వారా రాష్ట్రంలోని రెండు కోట్లకు పైగా ఓటర్లు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆరోపించారు. అయితే ఆ భయాన్ని తగ్గించడానికి మొత్తం కసరత్తును ప్రతిపక్ష పార్టీల బృందానికి డీకోడ్ చేసినట్లు ఎన్నికల కమిషన్ గురువారం తెలిపింది. 'ఎక్స్' చేసిన ఒక పోస్ట్‌లో... కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ ఈ అంశంపై స్పందిస్తూ, ఈ ప్రభుత్వం ప్రజలకు నరకం ఇవ్వడంలో ప్రత్యేకత కలిగి ఉంది. లక్షలాది మంది వారి ఓట్లు హక్కు కోల్పోయే ఒక దుష్ట కసరత్తు ఎస్ఐఆర్. అనవసరమైన తొందరపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన నిజమైన ఆందోళనలను పరిష్కరించడానికి వారు పూర్తిగా నిరాకరించడం, ఇది బీహార్‌లో ఎన్నికల వ్యవస్థను నాశనం చేయడానికి జరుగుతున్న స్పష్టమైన ప్రయత్నాన్ని సూచిస్తుంది' అని తెలిపారు. పొరుగు దేశం భారతదేశానికి ప్రత్యక్షంగా, పాకిస్తాన్ ద్వారా విసిరే భౌగోళిక రాజకీయ, ఆర్థిక సవాళ్లకు సమిష్టి ప్రతిస్పందన కోసం ఏకాభిప్రాయం సాధించడానికి, నరేంద్ర మోదీ ప్రభుత్వం పార్లమెంటులో భారతదేశం-చైనా సంబంధాలపై చర్చకు అంగీకరించాలన్నారు. 'పాకిస్థాన్ వైమానిక దళానికి చైనా ఎలా సహాయం చేసిందో లెఫ్టినెంట్ జనరల్ సింగ్ కొన్ని వివరాలను వెల్లడించారు. ఐదు సంవత్సరాల క్రితం లడఖ్‌లో యథాతథ స్థితిని పూర్తిగా నాశనం చేసిన చైనా ఇదే. కానీ ప్రధాని మోదీ జూన్ 19, 2020న బహిరంగంగా క్లీన్ చిట్ ఇచ్చారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ భారత-చైనా సంబంధాల పూర్తి స్థాయిపై పార్లమెంటులో చర్చ జరగాలని డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం అలాంటి చర్చను నిరంతరం నిరాకరిస్తోంది. జులై 21, 2025న ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశంలో కాంగ్రెస్ ఈ డిమాండ్‌ను కొనసాగిస్తుంది' అని అన్నారు. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అంశంపై కాంగ్రెస్ నాయకుడు కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ 'మేము దీన్ని కొనసాగించనివ్వము. వారు ఈ హాస్యాస్పదమైన కసరత్తును వెంటనే ఆపాలి' అని అన్నారు. ఈసీ బుధవారం ఇక్కడ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కలిసి, వారు లేవనెత్తిన వారి ఆందోళనలు, సమస్యలు, ప్రశ్నలను విని, వారికి మొత్తం ప్రత్యేక సవరణను డీకోడ్ చేసింది. కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్), జార్ఖండ్ ముక్తి మోర్చా, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), సీపీఐ(లిబరేషన్), శివసేన (ఉద్ధవ్ థాక్రే) ప్రతినిధులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిశారు. ఈ సందర్భంగా అర్హులయిన పౌరులందరినీ చేర్చుకోవడానికి వీలుగా ప్రణాళికాబద్ధంగా, నిర్మాణాత్మకంగా, దశలవారీగా ఈ కసరత్తు జరుగుతోందని ఈసీ పార్టీలకు తెలిపింది.

భారీ వర్షాలకు రూ.700 కోట్ల నష్టం

హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలం... 70 మంది మృతి

సిమ్లా: హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు సంభవించాయి. అనేకచోట్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ముందు జాగ్రత్తగా సుమారు 500కిపైగా రోడ్లను అధికారులు మూసివేశారు. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి 70 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మందికిపైగా గాయపడ్డారు. డజన్లకొద్దీ గల్లంతయ్యారు. వీరి కోసం సహాయక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 500కిపైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదు. ప్రజలు అంధకారంలోనే మగ్గుతున్నారు. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాలకు రూ700 కోట్లకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం అంచనా వేసింది. అంతకంటే ఎక్కువే నష్టం ఉంటుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా తెలిపారు. మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. శనివారం సిమ్లా, సోలన్, సిర్మౌర్, ఆదివారం ఉనా, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, కాంగ్రా, చంబా, మండి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది. ఏకాంత ప్రదేశాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. వర్షప్రభావం ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, నదులు, వాగులు, కొండ ప్రదేశాలకు వెళ్లొద్దని సూచించారు.

షిండే 'జై గుజరాత్' నినాదం

ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే మరోసారి సంచలనం రేపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రసంగం చివర్లో 'జై గుజరాత్' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పూణేలోని కోంధ్వాలో జైరాజ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌ను శుక్రవారం అమిత్ షా ప్రారంభించారు. ఏక్‌నాథ్ షిండే ఈ సందర్భంగా మాట్లాడారు. అయితే ప్రసంగాన్ని ముగించే ముందు అమిత్ షా గౌరవార్థం షేర్-షాయారీ వినిపించవచ్చా అని సభికులను అడిగారు. అక్కడున్న వారు సానుకూలంగా స్పందించారు. కాగా, ప్రసంగం ముగించిన తర్వాత ఏక్‌నాథ్ షిండే సభికులకు కృతజ్ఞతలు తెలిపారు. చివరన 'జై హింద్, జై మహారాష్ట్ర' అని అన్నారు. కొద్దిసేపు ఆగిన తర్వాత 'జై గుజరాత్' అని నినాదించారు. దీంతో ఆ కార్యక్రమానికి హాజరైన వారు ఆశ్చర్యపోయారు. అమిత్ షా మెప్పు కోసం 'జై గుజరాత్' అని ఏక్‌నాథ్ షిండే అనడం చర్చకు దారి తీసింది.

'నీట్' ఫలితాల పిటిషన్ సుప్రీం కొట్టివేత



న్యూదిల్లీ: నీట్ యూజీ-2025 ఫలితాలను మళ్లీ రిలీజ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోరు తిరస్కరించింది. ఓ ప్రశ్నలో తప్పు తలెత్తిన నేపథ్యంలో ఆ ఫలితాలను మళ్లీ ప్రచురించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. జస్టిస్ పీఎస్ నర్సింహా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై తీర్పునిచ్చింది. రెండు రోజుల క్రితమే ఇలాంటి పిటిషన్‌ను తిర్కసరించినట్లు ధర్మాసనం తెలిపింది. వ్యక్తిగత పరీక్షలతో డీల్ చేయలేదని కోర్టు చెప్పింది. మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్లు ఉన్న విషయాన్ని అంగీకరిస్తామని, కానీ లక్షల మంది రాసిన పరీక్షల్లో జోక్యం చేసుకోలేమని, ఇదేమీ వ్యక్తిగ కేసు కాదు అని, వేల మంది విద్యార్థులు దీని వల్ల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది. నీట్ యూజీ పరీక్ష పత్రంలో తప్పుడు ప్రశ్న వచ్చిందని, ఆ తప్పును సరి చేసి, మళ్లీ ఫలితాలను విడుదల చేయాలని కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కౌన్సింగ్ ప్రక్రియను ఆపేందుకు స్టే ఇవ్వాలంటూ కోర్టును కోరారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించింది.

'ప్యాడ్ మ్యాన్'గా రాహుల్ గాంధీ

కాంగ్రెస్ ప్రచారంపై రాజకీయ దుమారం

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ సరికొత్త ఎన్నికల వ్యూహం చేపట్టింది. అక్షయ్ కుమార్ హీరోగా తెరకెక్కిన ప్యాడ్ మ్యాన్ సినిమా స్ఫూర్తితో కాంగ్రెస్ మహిళా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అయితే దీనిపై రాజకీయ దుమారం చెలరేగింది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మై బహన్ మాన్ యోజన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ బీహార్‌లోని ఐదులక్షల మంది మహిళలకు శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం ఆరోగ్యంపై అవగాహన పెంచే ప్రయత్నంగానే ఉన్నా... మహిళలకు అందించే శానిటరీ ప్యాడ్లపై వివాదం రాజుకుంది. శానిటరీ ప్యాడ్ కవర్‌పై రాహుల్ గాంధీ ఫొటోతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా రూపొందించిన మై బహన్ మాన్ యోజన పథకం వివరాలు ఉన్నాయి. శానిటరీ ప్యాడ్ ప్యాకెట్లపై రాహుల్ గాంధీ ఫొటో ముద్రించడంపై బీజేపీ, ఇతర పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలు మహిళల్ని కించపరిచేలా, వారి గౌరవాన్ని తక్కువ చేసేలా ప్రచారం చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశాయి. బీజేపీ జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి 'రాహుల్ ఫొటోతో శానిటరీ ప్యాడ్ పంపిణీ చేయడం మహిళలిన్ అవమానించినట్టే' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్ మాత్రం బీజేపీ విమర్శల్ని ఖండిస్తోంది. మై బహన్ మాన్ యోజన పథకం ద్వారా అర్హత కలిగిన మహిళలకు నెలకు రూ.2,500 నేరుగా నగదు సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మహిళల గౌరవాన్ని, ఆత్మగౌరవం ప్రతిబింబించేలా ఈ పథకం పేరు మై బహన్ మాన్ అని పెట్టినట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మరోవైపు, నీతిష్‌కుమార్ ప్రభుత్వం కూడా మహిళా సంభాషణ అనే కార్యక్రమం ద్వారా రెండు కోట్ల మంది మహిళలతో నేరుగా సంప్రదింపులు జరుపుతోంది.

ఈ బ్యాంకుల్లో మినిమమ్ బ్యాలెన్స్ అక్కర్లేదు

న్యూదిల్లీ: పొదుపు ఖాతాల్లో కనీస సగటు నిల్వ లేనిపక్షంలో బ్యాంకులు అపరాధ రుసుం విధిస్తున్నాయి. అయితే, ఈ ఛార్జీల నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ మినహాయింపు కల్పించి ఖాతాదారులకు ఊరటనిస్తున్నాయి. బ్యాంకులోని అన్ని పొదుపు ఖాతాల్లో కనీస సగటు నిల్వ లేనిపక్షంలో విధించే పెనాల్టీలను ఎత్తివేస్తున్నట్లు పంజాబ్ నేషనల్ వెల్లడించింది. మహిళలు, రైతులు, అల్పాదాయ కుటుంబాలకు మద్దతుగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు ఎండీ, సీఈఓ అశోక్‌చంద్ర పేర్కొన్నారు. 'ఎలాంటి ఆందోళనలు లేని బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నాం. ఇకపై కనీస బ్యాలెన్స్‌లపై ఎలాంటి అపరాధ రుసుంలు ఉండవు. అన్ని పొదుపు ఖాతాలకు ఇది వర్తిస్తుంది' అని బ్యాంక్ ఆఫ్ బరోడా 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. జులై ఏడో తేదీ నుంచి అన్ని పొదుపు ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీలను మినహాయిస్తున్నట్లు ఇండియన్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఈ ఏడాది మేలోనే అన్నిరకాల పొదుపు ఖాతాలు, శాలరీ అకౌంట్లు, ఎన్నారైల ఎస్‌బీ అకౌంట్లు, మరికొన్ని ఇతర ఖాతాలకు కనీస నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) ఛార్జీలను రద్దు చేస్తున్నట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. విద్యార్థులు, శాలరీ ఖాతాలు ఉన్న ఉద్యోగులు, ఎన్నారైలు, సీనియర్ సిటిజన్లు, ఇతర వ్యక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా లావాదేవీలు నిర్వహించుకోవచ్చని పేర్కొంది. ప్రభుత్వరంగ అతిపెద్ద బ్యాంక్ ఎస్‌బీఐ చాలా ఏళ్ల నుంచే కనీస నిల్వలపై ఈ ఛార్జీల నుంచి ఖాతాదారులకు ఊరట కల్పిస్తోంది. 2020లోనే ఈ అపరాధ రుసుమును ఎస్‌బీఐ ఎత్తివేసింది. అన్ని పొదుపు ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోయినా ఎలాంటి ఛార్జీలు పడవు.

బీజేపీ, డీఎంకేతో పొత్తులుండవ్

సీఎం అభ్యర్థి విజయ్: టీవీకే

చెన్నై: వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ సీఎం అభ్యర్థిగా టీవీకే వ్యవస్థాపకుడు, సినీనటుడు విజయ్‌ను ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం చెన్నైలో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. అలాగే, వచ్చే నెలలో భారీ ఎత్తున రాష్ట్ర మహాసభలు నిర్వహించాలని పార్టీ ప్రతిపాదించింది. తమ పార్టీ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తమిళనాడు ఎన్నికల్లో వేర్పాటువాదులతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. బీజేపీతో చేతులు కలపడానికి తమ పార్టీ ఏమీ డీఎంకే, అన్నాడీఎంకే కాదన్నారు. బీజేపీ, డీఎంకేతో తమకు పొత్తులు ఉండబోవని విజయ్ స్పష్టంచేశారు. ఆ రెండు పార్టీలను తమకు సైద్ధాంతిక శత్రువులుగా పేర్కొన్నారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ జరిగిన ఈ కీలక సమావేశంలో పలు తీర్మానాలను పార్టీ ఆమోదించింది. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆంగ్ల భాషపై చేసిన వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవని పేర్కొంది. ఆయన వ్యాఖ్యలు తమిళనాడు ద్విభాషా విధానంపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. తమిళనాడుపై హిందీ, సంస్కృత భాషలు రుద్దడాన్ని తమ పార్టీ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టం చేసింది.

లలిత్ మోదీ, విజయ్ మాల్యా జల్సా

నూదిల్లీ: బిలియనీర్లు లలిత్ మోదీ, విజయ్ మాల్యా విదేశాల్లో జల్సా చేసుకుంటున్నారు. ఆ ఇద్దరు కలిసి ఓ పార్టీలో ఆటపాటలో మునిగిపోయారు. లండన్‌లో చాలా విలాసవంతంగా ఆ వేడుక నిర్వహించారు. లలిత్ మోదీ తమ పార్టీకి చెందిన వీడియోను ఇన్‌స్టాలో పోస్టు చేశారు. వార్షిక సమ్మర్ పార్టీని ఆర్గనైజ్ చేసినట్లు మోదీ చెప్పారు. సుమారు 310 మంది స్నేహితులు, అతిథులు ఆ వేడుకకు హాజరయ్యారు. బ్రిటన్ రాజధానిలో ఉన్న మోదీ నివాసంలోనే ఆ పార్టీ జరిగింది. మాజీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ చైర్మన్ లలిత్ మోదీ, లిక్కర్ బాస్ విజయ్ మాల్యా ఆ పార్టీలో స్టెప్పులేశారు. దేశవిదేశాల నుంచి అతిథులు పార్టీ కోసం లలిత్ మోదీ నివాసానికి చేరుకున్నారు. ఆర్‌సీబీ మాజీ ప్లేయర్ క్రిస్ గేల్ కూడా ఆ పార్టీకి వెళ్లాడు. లలిత్ మోదీ, మాల్యాతో దిగిన ఫొటోను గేల్ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్టు చేశాడు. ఐపీఎల్ వ్యవస్థాపక చైర్మన్‌గా ఉన్న లలిత్ మోదీ... ఆ తర్వాత ఈడీ కేసులు నమోదు కావడంతో దేశం విడిచి వెళ్లారు. ఫెమా, మనీల్యాండరింగ్ కేసుల్లో ఆయన విచారణ ఎదుర్కొంటున్నారు. లలిత్ మోదీని అప్పగించాలని భారత్ అనేక సందర్భాల్లో బ్రిటన్‌ను కోరింది. కానీ ఆయన బ్రిటీష్ రెసిడెంట్‌గానే కొనసాగుతున్నారు. రాజకీయ దురుద్దేశంతో తనపై కేసులు నమోదు చేశారని లలిత్ మోదీ ఆరోపిస్తున్నారు. యునైటెడ్ బేవరీస్ వ్యవస్థాపక చైర్మన్ విజయ్ మాల్యా 2016లో దేశం విడిచి వెళ్లారు. భారత ప్రభుత్వం ఆయనను ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ దివాలా కేసులో భారత ప్రభుత్వం సుమారు రూ.14 వేల కోట్ల ఆస్తులను సీజ్ చేసిందని గత ఏడాది ఓ పోస్టులో విజయ్ మాల్యా పేర్కొన్నారు. తాను ఇంకా ఆర్థిక నేరస్థుడిగా ఉన్నానని, చేసిన అప్పు కన్నా రెండింతలు ఎక్కువ తన వద్ద తీసుకున్నారని మాల్యా తన పోస్టులో రాశారు.

శ్రీకృష్ణ జన్మభూమి- షాహి ఈద్గా కేసులో

హిందూ పక్షానికి హైకోర్టులో ఎదురుదెబ్బ

అలహాబాద్: మథురలోని శ్రీ కృష్ణ జన్మభూమి- షాహి ఈద్గా వివాదం కేసులో అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ నిర్ణయం హిందూ పక్షానికి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. శ్రీ కృష్ణుడి జన్మస్థలంలో ఉన్న పురాతనమైన ఆలయాన్ని కూల్చివేసి ఈద్గా నిర్మించారని హిందూ పక్ష న్యాయవాది వాదించారు. ప్రస్తుతం ఉన్న వాస్తవాలు, పిటిషన్ ఆధారంగా మథురలోని షాహి ఈద్గాను వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించలేమని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఈ కేసుపై హిందువుల తరపు న్యాయవాది మహేంద్ర ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ మథురలోని షాహి ఈద్గా మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించాలని మార్చి 5, 2025న హైకోర్టులో దరఖాస్తు దాఖలైందని చెప్పారు. దీనిపై మే 23న కోర్టులో వాదనలు పూర్తయ్యాయని, కోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేయగా... నేడు తీర్పు వెలువరించిందని వెల్లడించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పిస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : విద్యార్థులు కోరిన మేరకు రెసిడెన్షియల్ స్కూల్‌లో డ్రైనేజీ, సైన్స్ ల్యాబ్, అదనపు టాయిలెట్లు తప్పకుండా ఇస్తామని, విద్యార్థులు కష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించు కోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు హితవు పలికారు. శుక్రవారం మేడ్చల్ మండలంలోని కిష్టాపూర్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ (బాలికలు)ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత చదువులు ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు తెలిపారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. స్కూల్లో వసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్‌కు సూచించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి డివిజన్‌లోని పలు కాలనీల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లక్ష్మీనగర్ కెనరా బ్యాంకు సమీపంలో రూ.28 లక్షల వ్యయంతో, మొగల్ కాలనీలో రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను రావుస్ నగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో కన్స్ట్రక్షన్ ఆఫ్ క్రాస్ డ్రైనేజ్ విత్ గ్రేటింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రావుస్ నగర్ కాలనీలో ఆర్సీసీ సేవరేజ్ పైపులైన్లు వేయించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మౌలాలి ఏ.ఈ. మధురిమ, స్థానిక కాలనీవాసులు కృష్ణయ్య, పవన్ కుమార్, ఆనంద్, లక్ష్మి, సయ్యద్, ఇస్మాయిల్, జోషి కుమార్, బిఆర్ఎస్ నాయకులు అమినుద్దీన్, సత్యనారాయణ, ఉస్మాన్, వంశీ, జేఏసీ వెంకన్న మేకల రాము యాదవ్, భాగ్యనంద్, నర్సింగరావు, మహేష్, రాజశేఖర్, మారుతి ప్రసాద్, శైలేందర్, దినేష్, స్వామి, దుర్గేష్, సంతోష్, కాశి యాదవ్, నవాబ్, ఆదినారాయణ, జోగుశ్రీనివాస్, హరీష్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర వినగానే మొదటగా గుర్తొచ్చేది తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి, విముక్తి కోసం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది అని కొనియాడారు. అడిషనల్ కమీషనర్‌లు అనురాగ్ జయంతి, రఘు ప్రసాద్, గీతా రాధిక, వేణుగోపాల్, సి.ఈ రత్నాకర్, చీఫ్ అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మొయినాబాద్: జమీందారుల, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బడుగు బలహీన వర్గాల జాతికి ఆనాడు దొడ్డి కొమరయ్య మరణం ఒక వేగుచుక్కగా మారి అందరినీ ఏకం చేసింది అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా చేవెళ్లలోని ఆయన విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విసునూరు దేశ్ముఖ్ జానకి ఆగడాలను అడ్డుకోవడానికి అప్పటివరకు శాంతియుతంగా చేస్తున్న నిరసనలు దొడ్డి కొమరయ్య మరణంతో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా మారి జమీందారుల నిరంకుశ పాలనకు చరమాంకం పలికిందన్నారు. రోజు దొడ్డి కొమరయ్య మరణంతోనే ప్రజల్లో ఒక ఆలోచన మొదలైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బందారి ఆగి రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్యాగరి రాములు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూకన్న లక్ష్మారెడ్డి, మాజీ ఉప సర్పంచులు గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి గుండాల రాములు, సొసైటీ డైరెక్టర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి, నాయకులు గుత్తి మల్లేష్, సునిగంటి సాయికుమార్ గాంధీ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ ఇనార్బిట్ మాల్‌లో ప్రత్యేక షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: సైబరాబాద్ ఇనోర్బిట్ మాల్‌లో ఇనార్బిట్ నియోటౌట్ పేరుతో ప్రత్యేక షాపింగ్ ఫెస్టివల్‌ను శుక్రవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇనార్బిట్ నియోటౌట్ షాపింగ్ రెండవ ఎడిషన్‌ను జూలై 4 నుండి 6 వ తేదీ వరకు జరపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో అజేయమైన డిస్కౌంట్లు, ప్రత్యక్ష వినోదం, సందడి చేసే నైట్ లైఫ్ వైబ్స్ ఉత్తేజకరమైన మిశ్రమాన్ని వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. మాల్ 100 ప్లస్ టాప్ బ్రాండ్లలో 50 శాతం ఆఫ్ అవుట్ అవుతుందని, రిటైల్ షాపింగ్ అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచబడుతుందన్నారు. మూడు రోజుల వేడుకలు జూలై 4 న ప్రత్యేకమైన కాఫీ రేవ్‌తో ప్రారంభమై, సెంట్రల్ డిజె జోన్ టిమ్ హెూర్టన్స్, థర్డ్ వేవ్, స్టార్‌బక్స్ బారిస్టాతో సహా ఐకానిక్ బ్రూవర్లు ఉన్నాయన్నారు. సాయంత్రం సుగంధ కాఫీ ఎలక్ట్రిక్ సంగీతాన్ని మిళితం కార్యక్రమాలు ఉంటాయన్నారు. జూలై 5న, సందర్శకులకి అక్షర్ బ్యాండ్, జూలై 6న గ్రాండ్ ఫైనల్ ఒక ఫ్లాష్ మాబ్ కలిగి ఉందన్నారు. 15 మంది ప్రొఫెషనల్ డాన్సర్లు మాల్ అంతటా 20 నిమిషాల ప్రదర్శనను అందించనున్నట్టు చెప్పారు.

యువ రాజకీయ నాయకులు

రోశయ్యని ఆదర్శంగా తీసుకోవాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని ఆయన గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలిపారు. అదేవిధంగా నేడు ఆయన విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. బహుశా మన దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదే అని గుర్తు చేశారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బడ్జెట్ ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యి అని కొనియాడారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్యదన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని, పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని పేర్కొన్నారు. ఇక వాక్పటిమ, వాగ్ధాటి, చతురతలో రోశయ్యతో ఇంకొకరిని పోల్చలేమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్‌గా నియామకం అయ్యి బిజేపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య ఒకరని, రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ ఆజాత శత్రువు రోశయ్య అని తెలిపారు. రోశయ్యది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమే అన్నారు. రోశయ్య శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళని, యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య ప్రసంగం ఒక పుస్తకం అని పేర్కొన్నారు. 2008 ఉప ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలలో రోశయ్య ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగిందని, వారి ప్రసంగాలకు నేను అభిమానిని చెప్పుకొచ్చారు. వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్యని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణానికి, ప్రజలకు మేలు కలిగేలా సింగరేణి మైనింగ్



విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి సంస్థ తన బొగ్గు తవ్వకాలను పర్యావరణానికి నష్టం కలగకుండా, సమీప ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా నిర్వహిస్తోందని, సంస్థ అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల, సమీప ప్రాంతాల అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తోందని సింగరేణి సంస్థ చైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ మైన్ క్లోజర్ పద్ధతుల ద్వారా పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన సింగరేణి తరఫున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ అవలంబిస్తున్న విధానాలను వివరించారు. సింగరేణి సంస్థ పర్యావరణకు హాని కల్పించని సర్ఫేస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్, డ్రాగ్ లైన్, కంటిన్యూయస్ మైనర్, లాంగ్ వాల్ వంటి మైనింగ్ టెక్నాలజీలని వినియోగిస్తుందని, నిబంధనల ప్రకారం మొక్కలు నాటుతూ వనాలుగా పెంచుతోందన్నారు ఇప్పటికే 7 కోట్ల 76 లక్షల మొక్కలను నాటడం జరిగింది అన్నారు. బొగ్గు గనుల ప్రారంభం నుండి మూసివేత వరకు, ఆ తదుపరి కూడా మైన్ క్లోజర్ ప్లాన్ లను నిబంధనల ప్రకారం తు.చ తప్పకుండా అమలు జరుపుతున్నామని, యథాస్థితి పర్యావరణ పరిస్థితులకు, సమీప గ్రామాల అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక చొరవ చూపిస్తుందన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ నుంచి వచ్చే సుమారు 1,205 లక్షల కిలో లీటర్ల నీటిలో కంపెనీ అవసరాలు పోగా మిగిలిన 820 లక్షల కిలో లీటర్ల నీటిని స్థానిక ప్రజల అవసరాల కోసం వినియోగించడం జరుగుతుందని, వీటిలో 465 లక్షల కిలో లీటర్ల నీటిని సమీపంలోని చెరువులు, కుంటలలోకి పంపించడం జరుగుతుందని మిగిలిన 330 లక్షల కిలో లీటర్ల నీటితో స్థానికులు తమ పంట పొలాలను సాగు చేస్తున్నారని తెలిపారు. మొత్తం మీద సింగరేణి సంస్థ అందించే నీటితో 13,625 ఎకరాలలో సేద్యం జరుగుతుందన్నారు. పాత గనులకు సంబంధించిన భవనాలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లను ప్రారంభించడం జరిగిందన్నారు. సమీప గ్రామాల నిరుద్యోగ యువతకు, మహిళలకు అనేక రకాల ఉపాధి అవకాశ శిక్షణలు ఉచితంగా అందించడం జరుగుతుందని, అలాగే ప్రతీ నెల సమీప గ్రామాల్లో ఉచిత మొబైల్ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సింగరేణిలోని ఖాళీ ప్రదేశాల్లో ఇప్పటికే 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, రెండవ దశ ప్లాంట్లు పూర్తయిన తర్వాత సింగరేణి సంస్థ నెట్ జీరో కార్బన్ ఎమిషన్ కంపెనీగా గుర్తింపు పొందనున్నదని పేర్కొన్నారు. చైర్మన్‌తో పాటు సింగరేణి తరఫున డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్ట్ చేసిన ఏఐవైఎఫ్ నేతలను విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీసు యంత్రాంగంకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని, నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎటువంటి ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలకు పిలుపునివ్వకున్నా పోలీసులు అన్ని జిల్లాల్లో ఉన్న ఏఐవైఎఫ్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ, బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్ర పోలీసులు ఆయా పార్టీ, ప్రజా సంఘాలకు సంబంధం లేకున్నా, ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పిలుపునివ్వకున్నా అక్రమంగా అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమన్నారు. వామపక్ష కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వాటి అనుబంధ ప్రజా సంఘాలు సమాజ హితాన్ని, ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరును నిరసిస్తూ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని, రాజీలేని పోరాటాలు చేపడుతాయన్నారు. ఏదేని కార్యక్రమాలున్నా ముందుగానే బహిరంగంగా ప్రచారం ద్వారా నిరసనలు, ముట్టడిలు చేపడుతామన్నారు. కానీ ఇవేమీ పట్టకుండా పోలీసు యంత్రాంగం, ఇంటెలిజెన్స్, కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య పోకడలనే అనుసరిస్తున్నదని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం నీరుగార్చేలా అధికారుల పోకడలు అప్రజాస్వామికన్నారు. అరెస్టులతో అణచివేత ధోరణిని కట్టడి చేయవచ్చనే దృక్పథంను మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎవరిని అదుపులోకి తీసుకోవాలో తెలుసుకోలేని పరిస్థితుల్లో మన రాష్ట్రంలోని పోలీసు అధికారులు ఉన్నారని విమర్శించారు. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసుల అవగాహన లేమి వైఫల్యం కారణంగానే, ఈ పొరపాట్లు జరుగుతున్నాయని అందుకే రాష్ట్ర పోలీసు యంత్రాంగం శిక్షణా తరగతులను ఏర్పాటు చేసి పూర్తి స్థాయి అవగాహనను కల్పించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నె ర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్, వంశీ పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో పాటు 4 కొత్త లేబర్ కోడ్ లను రద్దు చేయ్యాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈనెల 9 న దేశవ్యాప్త సమ్మెలో బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్ రంగాల ఉద్యోగులుపెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె సన్నద్ధంలో భాగంగా హైదరాబాద్, కోఠి లోని ఎఐబిఇఎ రాష్ట్ర కార్యాలయంలో గురువారం యూనైటెట్ ఫోరం ఆఫ్ పబ్లిక్ సెక్టార్ యూనియన్స్ (యుఎఫ్‌పియు) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ సెక్టార్ యూనియన్స్ కోఆర్డినేటర్ వి.ఎస్.బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, యుఎఫ్‌పియు కన్వీనర్ ఎస్.వి.రమణ, ఎఐపిఆర్‌డిఎ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.జలాల్లుద్దిన్, ఎం.శివశంకర్ (జిఐజిఎఐఎ, తెలంగాణ) బి.నర్సింహులు (పోస్టల్ యూనియన్, తెలంగాణ), పి.అజయ్ కుమార్, పి.ఉదయ్ భాస్కర్, (డిజిఎస్, ఎపిటిబిఇఎఫ్), ఎఐబిఒఇ అధ్యక్షులు పిఎస్‌పిఆర్ పణికుమార్, జిఐఇఎఐఎ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.కిషన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాల పేరుతో కేంద్ర ప్రభుత్వం తిరోగమన పోకడలను అనుసరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంక్‌లు, ఇన్సురెన్స్ రంగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు ఈ రంగాలను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకుల జాతీయకరణ తర్వాత 1990 ల నాటికి 60 శాతం వరకు పెరిగిన ప్రభుత్వరంగ బ్యాంకుల గ్రామీణ శాఖలు మళ్ళీ 26 శాతానికి పడిపోయేలా చేశారన్నారు. ఎన్‌బిఎఫ్‌సిలు,పేమెంట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలు రంగప్రవేశం చేసేలా చేసి ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా రుణాలు అందని పేద మధ్య తరగతి ప్రజలు ఈజీ మనీయాప్ అందుబాటులోకి తీసుకురావడంతో ఫైనాన్స్‌కంపెనీల ఉచ్చులోపడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్స్యూరెన్స్ వ్యాపారం లో 100 శాతం విదేశీ పెట్టుబడులను నిరోధించడంతోపాటు ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలను విలీనం చెయ్యాలని తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ సమ్మెను జయప్రదం చేయాలని రాంబాబు కోరారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి అనేక రాయితీలను ఇస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తూ ఏకపక్షంగా కార్మిక చట్టాలను 4 కోడ్ల రూపంలో మార్చడం గర్హనీయమన్నారు. ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో దేశ వ్యాప్తంగా 25 కోట్లమంది సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతులు, బ్యాంకింగ్, భీమా రంగం ఉద్యోగులు పాల్గొంటున్న ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యమై విజయంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల భద్రత ప్రమాణాలపై చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సిగాచి పరిశ్రమంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు బాసటగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన పటాన్ చెరువు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించారు. స్పెషల్ సెక్రటరీ రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ, అరవింద్ కుమార్, పరిశ్రమలు, కార్మిక శాఖ, స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అగ్నిమాపక శాఖ అధికారులతో పరిశ్రమలో అగ్నిమాపక శాఖ, పొల్యూషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, పరిశ్రమల శాఖ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిశ్రమల భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ మెకానిజం నిర్వహణపై సంబంధిత శాఖలతో ఆయన సమీక్షించారు. పరిశ్రమలో రియాక్టర్లు, డ్రైయర్లు, ఫైర్ ఫైట్ సిస్టం, ఉద్యోగుల రక్షణ మార్గాలు, ఇతర భద్రతా అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు. ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు మృతుల వివరాలు మృతుల ఐడెంటిఫికేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల కోసం ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా త్వరలో మృతుల కుటుంబాలకు క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. సహాయ చర్యలు మరింత సమర్థవంతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద వర్ధంతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ శుక్రవారం ఎన్‌టీఆర్ భవన్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ ప్రజలే తన కుటుంబంగా భావించి నాయకులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్వామి వివేకానంద చెప్పారని అన్నారు. అలాగే నాయకులు చిన్న పిల్లవానివలె ఉండాలని కూడా చెప్పారని అన్నారు. స్వామి వివేకానంద విదేశాలలో పర్యటించిన తరువాత భారత దేశానికి వచ్చి భారత దేశంలో అభివృద్ధి చెందకపోవడానికి 5 కారణాలను స్వామి వివేకానంద చెప్పారని కులం, అంటరానితనం, స్త్రీ అణచివేత, విద్యా విధానంలో లోపాలు, అణగారిన వర్గాలను అక్కున చేర్చుకునే విధానం లేకపోవడం, ఈ 5 అడ్డంకులు భారతదేశం అభివృద్ధి చెందకపోవడానికి కారణంగా స్వామి వివేకానంద గుర్తించారన్నారు. స్వామి వివేకానంద గుర్తించిన సమస్యలను నిర్మూలించి ప్రజలను సంక్షేమం, అభివృద్ధివైపు నడిపించడానికి తెలుగుదేశం పార్టీ, ఎన్‌టిఆర్, చంద్రబాబు కృషి చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజునాయక్, శ్రీనివాసా నాయుడు, నెల్లూరు దుర్గాప్రసాద్, మీడియా కమిటీ చైర్మన్ ప్రకాశ్ రెడ్డి, పోలంపల్లి అశోక్, జనగాం నర్సింగరావు, కట్టా రాములు, గూడెపు రాఘవులు, ఎబిఆర్ మోహన్‌రావు, తమోదన్‌రావు, జగదీష్, సాయి నాగార్జున, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఛలో ఎల్బీ స్టేడియం కార్యక్రమానికి కదం తొక్కిన కాంగ్రెస్

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ ద్వారానే సంక్షేమ ఫలాలు అందించాలంటే గ్రామ సీమ నుండి దేశ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాక సందర్భంగా టిపిసిసి ఇచ్చిన పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు సభకు తరలి వెళ్లారు. నియోజకవర్గ వ్యాప్తంగా 6 మండలాలు రెండు మున్సిపాలిటీల నుండి 600 వాహనాలు 3,000 మంది కాంగ్రెస్ పార్టీ ముఖ్య విభాగాలు, అదేవిధంగా ముఖ్య కార్యకర్తలు మల్లికార్జున ఖర్గే సభకు భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని రూపుమాపే విధంగా భారతీయ జనతా పార్టీ కుట్రలు పన్నుతోందని ఇందులో భాగంగానే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సారాధ్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడి యంలో ఏర్పాటు చేసిన సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లడం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్లతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దించి కాంగ్రెస్ పార్టీని దేశవ్యాప్తంగా ప్రజలు బలపరచాలని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT THE XXXIV ADDL. CHIEF JUDICIAL MAGISTRATE, MAYOHALL AT BENGALURU
CC. No. 51380/2022

BETWEEN:
Satish Patchigolla @ Vankata Satish Patchigolla Son of late Patchigolla Satyanarayana Murthy Aged 52 years Residing at Flat No. G- 502 Tower-6, Adarsh Palm Retreat Devarabisanahalli, Bellandur Bangalore-560 103. ....COMPLAINANT

AND:
Godi Sathish Reddy Son of Pitchi Reddy Godi Aged 44 years Residing at Residing at Flat No. K203 Tower-6, Adarsh Palm Retreat Devarabisanahalli, Bellandur Bangalore-560 103. Also residing at Plot No. 1291, Road No.65, Jubilee Hills Hyderabad-500034. ...ACCUSED

PROCLAMATION

Whereas, the Complaint has been made before the Hon'ble XXXIV Additional Chief Judicial Magistrate, Bangalore (Mayo Hall) against the above named Accused has committed the offence (or is suspected to have committed) under Section 138 of the Negotiable Instruments Act, 1881 and a warrant of arrest was issued against the Accused and the said Accused Godi Sathish Reddy cannot be found and whereas it has been shown to Hon'ble XXXIV Additional Chief Metropolitan Magistrate, Bangalore(Mayo Hall) satisfaction that the Accused is absconding or is concealing himself to avoid the service of the said warrant. WHEREFORE, Proclamation will be made in Visalaandhra Telugu Newspaper that the said Accused is required to appear before the Hon'ble XXXIV Additional Chief Metropolitan Magistrate, Bangalore (Mayo Hall) to answer the said complaint on 5.8.2025.

Given under my hand and seal to the Court. On this 4th day of July 2025.

By Order of the Court.
SHERISTEDAR
XXXIV ADDL. CHIEF JUDICIAL MAGISTRATE COURT
BENGALURU CITY

TRINETRA & PARTNERS
R Madhusudhana Reddy
Advocate
No.209, 2nd Floor, Mota Chambers, No.9, Cunningham Road, Bangalore-560052. Mobile: 9900062200

ఎల్బీ స్టేడియంకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీ కార్పొరేటర్ కార్యాలయం నుండి కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైనంపల్లి హనుమంతరావు విచ్చేసి డివిజన్ నుండి రాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందు తాయని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలావాలని అన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల కాలంలో బనకచర్ల ప్రాజెక్టు నాటి ప్రభుత్వ హయాంలోని మొదలుపెట్టినప్పటికీ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, గుండా నిరంజన్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, ఉపేందర్, బ్రహ్మయ్య, శంకర్ రావు, మోహిన్, మౌసిన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారాహి అమ్మవారి పూజలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దర్శనంతో పాటు గణపతి, మహాలక్ష్మి, సుదర్శన. అరుణ, రుద్రసహిత శతచండి యాగంలో శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మంజుల గౌడ్, జెఎసి వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, రాము యాదవ్, రాములు, లక్ష్మణ్ రావు, శ్రీకాంత్, భారతి, బిఆర్ఎస్ నాయకులు, కార్యనిర్వాహకులు సుధాకర్ శర్మ, తెలంగాణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, శ్రీనివాస్, బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి లో షియా ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో నిర్వహించే పీర్ల పండుగ కు హాజరై పీర్లకు దట్టి కట్టి పీర్లను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మోస్తూ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొహరం పండుగ సందర్భంగా షియ ముస్లింలు సంతోషంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ప్రజలందరు కలిసి నిర్వహించుకునే పండగ మొహరం అని ఎమ్మెల్యే తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, జేఏసీ వెంకన్న, రాముయాదవ్ ఉస్మాన్, సత్యనారాయణ, వంశీ, నవాబు, దినేష్, రాజశేఖర్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు షియా ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పటేల్ కుంట చెరువు సుందరీకరించేందుకు చర్యలు

విశాలాంధ్ర - కాప్రా : పటేల్ కుంట చెరువులోకి మురుగునీటి ప్రవాహాన్ని నిలిపేందుకు పైపులైన్ పనులు పూర్తిచేస్తాం, పటేల్ కుంట చెరువులోకి మురుగునీరు చేరకుండా పైపులైన్ ఏర్పాటు చేయడంతో పాటు పనులు పూర్తికాగానే చెరువు శుద్ధి ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. పటేల్ కుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా దోమల సమస్య అధికమవుతూ వర్షాకాలం సీజన్లో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి తక్షణ చర్యలు ప్రారంభించారు. నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్, బాబానగర్, ఎర్రకుంట, రామ్‌రెడ్డి నగర్, ప్రజలు కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే జోనల్ కమిషనర్,అడిషనల్ కమిషనర్ పంకజ్‌తో పాటు ఎల్బీనగర్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డిలతో మాట్లాడిన ఎమ్మెల్యే చెరువులోని గుర్రపు డెక్కను తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకున్న డ్రోన్‌తో చెరువులో ఎంఎల్‌ఓ స్ప్రే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెరువు వద్ద ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ నేతృత్వంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఎంఎల్ఓ ఆయిల్ స్ప్రేతో గుర్రపు డెక్క ఎండిపోయి నశించే అవకాశం ఉందని దాంతో దోమల లార్వా చనిపోతుందని కాప్రా సర్కిల్ ఎంటమాలజిస్ట్ డి. రమేష్ తగ్గుతుందని ఎమ్మెల్యేకు తెలిపారు. హెచ్ఎంటీ చెరువు మాదిరిగా పటేల్ కుంట చెరువును కూడా సుందరీకరించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ రాగిరి లక్ష్మా రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజన్ శేఖర్, ఈస్ట్ జోన్ సీనియర్ ఎంటమాలజీ మాధవ రెడ్డి, కాప్రా సర్కిల్ ఏఈ డి. రమేష్, ఫాగింగ్ సూపర్వైజర్ పరమేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భూభారతి, రేషన్‌కార్డులు, ఎల్ఆర్ఎస్‌లను త్వరగా పరిష్కరించాలి

కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : మల్కాజిగిరి జిల్లా భూభారతి, రేషన్ కార్డులు, ఎల్.ఆర్.ఎస్ పెండింగులను త్వరితగతిన పరిష్కరించాలని, అవసరమైన చోట మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టరు మను చౌదరి హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మండలాల, మున్సిపాలిటీల వారిగా భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ పెండింగ్ కు గల కారణాలను తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబంధించిన కోర్టు కేసులను, లిటిగేషన్‌లో ఉన్న ప్రభుత్వ భూముల ఫిజికల్ పొజిషన్ పరిశీలించి తన దృష్టికి తీసుకురావాలని కలెక్టరు సూచించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించేందుకు గల కారణాలను తెలుపుతూ నివేదికలు పంపాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములను కబ్జాకు గురి కాకుండా కాపాడాలని తహసీల్దార్లను కలెక్టరు ఆదేశించారు. త్వరితగతిన రేషన్ కార్డులు పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలని కలెక్టరు సూచించారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తూ ఎల్ఆర్ఎస్ కట్టిన వారికి ప్రొసిడింగ్స్ అందించాలని, అవసరమైన వాటికి క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కూడా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నవని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్లను, మున్సిపల్ ఆఫీసర్లను ఆదేశించారు.

డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీ కి చెందిన శ్రీ మహమ్మద్ అబ్దుల్ జాఫర్కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 2,50,000 రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాన్ని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని తెలిపారు. హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ జాఫర్‌కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2,50,000లు మంజూ అయినవి అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, మారేళ్ల శ్రీనివాస్, హరి కృష్ణ పాల్గొన్నారు.

కేజీ టు పిజి వరకు ఉచిత విద్య అందించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన విద్యా హక్కు చట్టం ప్రతి బిడ్డకు విద్యను ప్రాథమిక హక్కుగా మార్చిందని, ప్రభుత్వాలు ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి ఏం.వి ఫౌండేషన్ కార్యదర్శి ఆర్. వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం "ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీలపై ఆమ్ ఆద్మీ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆప్ రాష్ట్ర నాయకులూ బుర్ర రాము గౌడ్ అధ్యక్షత వహించగా అఖిల పక్ష నాయకులూ, వివిధ సంఘాలనుండి మేధావులు, విద్యావంతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ విద్యాహక్కు చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిందని, విద్యా హక్కును రక్షించడం, గౌరవించడం నెరవేర్చడం రాష్ట్రాల బాధ్యత అని తెలిపారు. విద్య హక్కు చట్టంలో భాగంగా కేజీ తో పిజి వరకు ఉచిత విద్య అందించాలని కోరారు. టీచర్స్ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ అధ్యక్షులు జనార్దన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించి, పిల్లలకు నాణ్యమైన విద్యను అందిచాలని, దేశంలోని 6 నుంచి 14 ఏళ్ల వయస్సుగల పిల్లలందరికీ తప్పనిసరిగా ఉచిత, నిర్బంధ విద్య అమలు చేయాలనీ కోరారు. తల్లితండ్రుల సంఘం అధ్యక్షురాలు జి. భాగ్యమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 5 వేల ప్రభుత్వ పాఠశాలలలో మొదటి తరగతి నుండి ఐదవ తరగతి వరకు ఒకటే టీచర్ పాఠాలు చెప్పడం, విద్య వ్యవస్థ ఎంత దారుణంగా తయారైందో తెలుస్తుందన్నారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. అబ్బాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కాకపోవడంతో ప్రత్యేక విభాగాలకు చెందిన విద్యార్థులు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. చైల్డ్ రైట్స్ ఫోరమ్ ప్రతినిధి డి. ప్రకాష్, మదర్ లవ్ సంస్థ ప్రతినిధి డా. ఏ. శ్రీనివాస్, స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి కె. వెంకట్ సాయినాథ్, అక్షర ఫౌండేషన్ ప్రతినిధి ఆంజనేయులు, ఆప్ నేతలు డా. సోలొమన్ రాజ్, సుధారాణి, నర్సింగ్ యమునా గౌడ్, డా. లక్ష్య నాయుడు, జావీద్ షరీఫ్, జిల్లోజు హేమ, దర్శనం రమేష్, సోహైల్, షాబాజ్, అజీజ్ బేగ్, రాకేష్ రెడ్డి, రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్‌గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారికంగా 92 వ జయంతి వేడుకలను జరిపారు. మాజీ సి. ఎం.రోశయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను ఉద్యోగంలోకి రావటం జరిగిందని, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేపట్టిన ప్రతి పదవికి కూడా ఎంతో వన్నె తెచ్చారని, మంచి వ్యక్తిత్వం గల మహోన్నతమైన వ్యక్తి అని ఆయన సేవలు సందర్భంగా కొనియాడారు. అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డి, డిఆర్వో ఇన్చార్జ్ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ : ఆర్యవైశ్యులు అగ్రగామిగా పేరొందిన ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే.రోశయ్య అందరికీ ఆదర్శమని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మలిపెద్ది శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కే.రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన బాటలో ప్రతి ఆర్యవైశ్య పౌరుడు ఆయన ఆశయాలకు సాధనకు కురిచేస్తుండడం గొప్ప విషయం అన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నాగిళ్ల గోపాల్ గుప్త తదితర ఆర్యవైశ్య సోదరులు కన్యకాపరమేశ్వరి ఆలయంలోపూజలు అనంతరం సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెన్నయ్య, వెంకట్ రాంరెడ్డి, సరపు జగదీశ్వర్,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాసులు, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఆగిర్ రవి కుమార్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నాగిళ్ల గోపాల్ గుప్త, బెజుగం రమేష్, జర్నలిస్టులు బాల రాజేష్, సరపు రమేష్, కాంగ్రెస్ పార్టీ నేతలు వై. యాదయ్య యాదవ్, చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూర్ బస్వం, ఇబ్రహీం, మహిళా నేత ఐటీఐ రాజు హర్ష గౌడ్, కొమ్ము కృష్ణ, దంగూ శ్రీనివాస్ యాదవ్,మురళి మోహన్ అప్పి, అందే మోహన్, జాంగారి రవి, యాదగిరి యాదవ్, ఖదీర్, దాకం మనీశ్, అర్జున్ లక్ష్మన్, ముబరక్, రాజేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో దొడ్డి కొమురయ్యకు నివాళులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తెలంగాణ అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, జి వినోద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బండ ప్రకాష్, శాసనసభ కార్యదర్శి వి నరసింహచార్యులు నివాళులర్పించారు.

తెలంగాణలో అడుగుపెట్టిన పీహెచ్ డీసీసీఐ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భారతదేశంలోని పురాతన, ప్రముఖ జాతీయ వాణిజ్య సంఘం అయిన పీహెచ్ డి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్ డీసీసీఐ) తన తెలంగాణ శాఖను ప్రారంభించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, పోకర్ణ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన గౌతమ్ చంద్ జైన్ తొలి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అయనకు రాయిల పరిశ్రమ (స్టోన్ ఇండస్ట్రీ), ఫ్యాషన్ రంగంలో 50 సంవత్సరాల అనుభవం ఉంది. ఈ సందర్భంగా "భారతదేశ యుకె ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ భారత పరిశ్రమలపై ప్రభావం" అనే అంశంపై ఓ ఇంటరాక్టివ్ సెషన్ మాధాపూర్‌లోని హోటల్ అవాసాలో గురువారం రాత్రి నిర్వహించారు. గారెత్ విన్ ఓవెన్, యుకె డిప్యూటీ హై కమిషనర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ), ముఖ్యఅతిథి మాట్లాడుతూ ఈ ఎఫ్ టీఏ ఒప్పందం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని గణనీయంగా పెంచుతుంతదని పేర్కొన్నారు. హేమంత్ జైన్, పీహెడీసీసీ జాతీయ అధ్యక్షుడు మరియు రూ.15,000 కోట్ల కెఎల్ జే గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ పీహెచ్ డీసీసీఐదేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని, 55 ఇండస్ట్రీ విభాగాలు కలిగి ఉందని వివరించారు. 1.5 లక్షలకు పైగా ప్రత్యక్ష పరోక్ష సభ్యులు ఉన్నారని తెలిపారు. పాలసీ రూపకల్పనలో భాగస్వామ్యం కావడం చాలా ఆవశ్యకం," అన్నారు.

సంవిధాన్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : శుక్రవారం జై బాబు జై భీమ్ జై సంవిధాన్ భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే విచ్చేస్తున్న సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలన్ కొలను హన్మంత్ రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఎన్ ఎమ్ సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున బస్సులలో సభకు బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ప్రముఖ ఆభరణాల వ్యాపార సంస్థగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్, డైమండ్స్, హైదరాబాద్, కూకట్పల్లిలోని నెక్సస్ హైదరాబాద్ మాల్లో తమ కొత్త షోరూము ప్రారంభాన్ని సగర్వంగా ప్రకటించింది. 3,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో తీర్చిదిద్దిన ఈ కొత్త షోరూమ్, విభిన్నడిజైన్లు, శైలులతో అద్భుతమైన ఆభరణాల సేకరణలతో వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి షాపింగ్ అనుభూతిని అందించడానికి రూపొందించినట్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజన్లో మలబార్ 44వ అవుట్ లెట్ ఈ షోరూమ్ గుర్తింపు పొందిందనీ వెల్లడించింది. ఈ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్, మలబార్ గోల్డ్, డైమండ్స్ ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఓ. అషర్, మేనేజ్ మెంట్ బృందం సభ్యులు, కస్టమర్ల చేతుల మీదుగా ప్రారంభించారు. బంగారం, వజ్రం, ప్లాటినం, రత్నం, వెండి ఆభరణాల విస్తృత సేకరణలు లభిస్తాయనీ తెలిపారు. అదనంగా బంగారం, అన్కట్, రత్నాభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపును, అలాగే వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపును అందిస్తున్నామని, ఈ ఆఫర్లు జులై 27వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : జులై 9న జరిగే దేశవ్యాప్త స్ట్రైక్ సందర్భంగా నేరెడ్మెట్ చౌరస్తా వద్ద జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జై వెంకటేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జులై 9న సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్లు రద్దు చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతు జులై 9 జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులందరూ పాల్గొంటున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం అభద్రత బావనలో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్, మల్కాజ్‌గిరి జిహెచ్ఎంసి సర్కిల్ మున్సిపల్ యూనియన్ కార్యదర్శి కే నాగరాజు వెంకన్న అంజమ్మ లత రేణుక నవనీత,పద్మ, అంజయ్య, సిద్దయ్య, ఎల్లయ్య ఉన్నారు.

ఎనర్జీ-ఎఫిషియెంట్ బిఎల్‌డిసి సీలింగ్ ఫ్యాన్ల శ్రేణి ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ప్రముఖ కన్స్యూమర్ ఎలక్ట్రికల్ బ్రాండ్ నిప్పోను తయారు చేసే ఇండో నేషనల్ లిమిటెడ్, తన హోం సొల్యూషన్స్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ కొత్త బి.ఎల్.డి.సి (బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్) సీలింగ్ ఫ్యాన్ల శ్రేణిని ప్రారంభించింది. తక్కువ విద్యుత్ వినియోగంతో అధిక పనితీరు ఇవ్వడానికి వీటిని రూపొందించగా, భారతదేశంలో వేగంగా పెరుగుతున్న ఎనర్జీ-ఎఫిషియెంట్ ఫ్యాన్ విభాగంలో నిప్పో వ్యూహాత్మక ప్రవేశాన్ని ఇది సూచిస్తోంది. భారతదేశంలోని బి.ఎల్.డి.సి ఫ్యాన్ మార్కెట్ ప్రస్తుతం సుమారు రూ.1,000 కోట్లుగా అంచనా వేయబడింది. ఈ విభాగంలో తదుపరి ఐదు సంవత్సరాల్లో 10% మార్కెట్ వాటాను సాధించాలన్న లక్ష్యంతో నిప్పో ఈ అడుగు వేసింది. కంపెనీ బలమైన పరిశోధన, అభివృద్ధి సామర్థ్యం, నమ్మకమైన ఉత్పత్తి నాణ్యత, విస్తృత రిటైల్, ఈ-కామర్స్ పంపిణీ నెట్‌వర్క్‌లు దీన్ని మద్దతు ఇస్తాయి. ఈ ప్రారంభం గురించి నిప్పో సీఈఓ పవన్ కుమార్ బీఏఎస్ మాట్లాడుతూ, బి.ఎల్.డి.సి ఫ్యాన్ శ్రేణితో సీలింగ్ ఫ్యాన్ విభాగంలోకి ప్రవేశించడం మాకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తోంది. భారతీయ గృహాల కోసం మేము మరింత సుస్థిరమైన, వినూత్నమైన ఉత్పత్తుల శ్రేణిని నిర్మించాలన్న మా ఆకాంక్షను ఇది ప్రతిబింబిస్తుంది. సాధారణ సీలింగ్ ఫ్యాన్లు 80 వాట్లు విద్యుత్ వినియోగిస్తే, నిప్పో ఈ ఫ్యాన్లు ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సిమ్యులేషన్, ఫైనైట్ ఎలిమెంట్ విశ్లేషణ, సెన్సర్‌లెస్ అల్గోరిథం డిజైన్, పవర్ ఎలక్ట్రానిక్స్ ఆప్టిమైజేషన్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయబడ్డాయి.

తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సందర్భంగా సురవరం వెంకట్రాంరెడ్డి భవన్ సిపిఐ ఆఫీస్‌లో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాల్ కిషన్ మాట్లాడుతూ నిజాం రాజ్యంలో ఉన్న ఒక ప్రాంతం విసునూర్ అని దీన్ని దేశ్ముఖ రాపాక రామచంద్రారెడ్డి 60 గ్రామాలు ఇతను ఆధీనంలో ఉండేవన్నారు. అందులో కడివెండి గ్రామము ఒకటి ఈ గ్రామంలోనే దేశ్ముఖ్ అమ్మ జానకమ్మ ఉంటూ తన అకృత్యాలను కొనసాగిస్తూ ఉండేదని వివరించారు. 40 ఎకరాల సాగును 400 ఎకరాలకు చేర్చిందన్ని గ్రామాల లాగే కడవెండి కూడా రాచరిక భూస్వామ్య పాలన ఫలితాలు అనుభవిస్తుందన్నారు. స్వీయ చైతన్యంతో అన్యాయాలకు వ్యతిరేకంగా సంకటితమయిందన్నారు. 1944 భువనగిరి ఆంధ్ర మహాసభలో రావి నారాయణరెడ్డి పిలుపుతో కడవెండి గ్రామం అగ్నిశిఖగా మారింది తమ సంఘటిత శక్తికి భరోసా ఉందని దున్నే వాడికి భూమి అక్రమ పనులు రద్దు వంటి కమ్యూనిస్టు వినాదాలతో ప్రేడితమై సంతోషంతో ఉత్తేజంతో దొరల అక్రమాలను ఎదురుకోవడం కోసం దొడ్డి కుమరయ్య, మల్లయ్య, నల్ల నర్సింలు, కొండల్ రెడ్డి, కొండయ్య, హస్నాల నరసోజి, మోహన్ రెడ్డి, దావీద్ రెడ్డి వంటి వారితో గ్రామరక్షణ కమిటీ ఏర్పాటు అయింది. జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, ఏఐవైఎఫ్ కో కన్వీనర్ మహేష్, పట్టణ నాయకులు ఆనంద్,. నరహరి, శ్రావణ్ కుమార్ రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారికంగా నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ శ్రీధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర- హైదరాబాద్ : తెలంగాణ తొలి పోరాట యోధుడు అమరుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి కార్యక్రమాన్నిశంషాబాద్ కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహిచారు. తెలంగాణ పోరాటంలో కురుమలు చేసిన త్యాగాలు, బలిదానాలు స్మరిస్తూ అధ్యక్షుడు మామిడిపల్లి జంగయ్య, శంషాబాద్ మున్సిపాలిటీ నాయకులు కర్రె మధుసూదన్ కుర్మ, శీలం కృష్ణ, కడల అనిల్ కుమార్, తుల్జా విజయ్ కుమార్, బుడుగు మహేందర్, శంషాబాద్ మున్సిపాలిటీ కురుమ సంఘం నాయకులు, మండల నాయకులు అందరూ కలిసి నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీ చౌరస్తాలో మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజు జరిగినది. రచ్చ కిషన్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మరియు బాపిరాజు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరుడై స్ఫూర్తినిచ్చిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి జె లక్ష్మి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే ప్రమీల, సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, జి నాగరాజు ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బి కే యం యు మండల కార్యదర్శి అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు ఇస్తారు, నర్సమ్మ, భారతి, మణెమ్మ, మేకల లక్ష్మి, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : న్యూ నాగోల్ లోని, ప్రజా సంఘాల కార్యాలయం లో, బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో, మండల నాయకులు ఉడుతల మల్లేష్ గౌడ్ అధ్యక్షతన అమర వీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీసీ హక్కుల సాధన సమితి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ హాజరై విప్లవీరుడు కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనాడు తెలంగాణలో నూతన యుగ ఆవిష్కరణకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అంకురార్పణ చేసింది. 1940 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కొరకు, వెట్టి చాకిరి విముక్తి కొరకు సాగిన పోరాటలొ పాల్గొన్న నాయకులలో ఒకరైన దొడ్డి కొమరయ్య ప్రాణాలు బలిపెట్టి ఉద్యమ బలోపేతానికి తెగువ చూపించి ఉదృతంగా సాగిందన్నారన్నారు. ఉచిత విద్య వైద్యం ఉద్యోగం నివాసం ఏర్పాటులో పాలకులు ఏనాడో విఫలమయ్యారని నేటికైనా కమ్యూనిస్టులను, కమ్యూనిస్టు ఉద్యమాలను ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. దండు నిరంజన్, సంఘ సైదారావు, చేరుకు నాగభూషణం, ఎండీ హమీద్, జగన్ యాదవ్, కే.మురళి, సిహెచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.

యువ వైద్యులపై ప్రభుత్వం వివక్ష

పీఆర్ అడిగితే అరెస్టు చేస్తారా?

విద్యార్థి సంఘాల మండిపాటు

విశాలాంధ్ర-విజయవాడ: విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసిన యువ వైద్యులకు శాశ్వత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని కోరుతూ వైద్య విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, వైసీపీ విద్యార్థి సంఘాల నేతలు గురువారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వద్ద ధర్నా నిర్వహించారు. 'మా పీఆర్ మాకు ఇవ్వండి' అంటూ ధర్నా చేసిన యువ వైద్యులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయి కుమార్, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ విదేశాల్లో వైద్య విద్యతో పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన యువ వైద్యులకు శాశ్వత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏపీ వైద్య మండలి రిజిస్ట్రార్ ఐ.రమేష్ యువ వైద్యుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. అన్ని అర్హతలను సాధించిన యువ వైద్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఏపీకి చెందిన దాదాపు 1,500 మంది యువ వైద్యులు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం 13 నెలలుగా చెప్పులు అరిగేలా కౌన్సిల్ చుట్టూ తిరుగుతున్నా వారి గోడును పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ హెల్త్ యూనివర్సిటీ ఎదుట ఆందోళనకు దిగితే పోలీసులతో ఈడ్చేసి... మహిళా వైద్యులను కాళ్లతో తొక్కేసి... వాహనాల్లో ఎక్కించి కర్కశత్వాన్ని ప్రభుత్వం చాటుకుందని ధ్వజమెత్తారు.

యువ వైద్యులకు సంఘీభావం

పీఆర్ సాధించేందుకు ధర్నా చౌక్ వద్ద యువ వైద్యులు చేపట్టిన నిరాహార దీక్ష నాల్గవ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్దకు విద్యార్థి సంఘ నాయకులు చేరుకుని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వైసీపీ యువ నాయకులతో పాటు వచ్చిన కార్యకర్త దీక్షా శిబిరం వద్ద అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో దీక్షలో ఉన్న యువ వైద్యులు అతనికి ప్రథమ చికిత్స అందించారు. ఈ సందర్భంగా అస్వస్థతకు గురైన వ్యక్తికి వైద్యం అందించి ప్రాణాలు నిలిపిన ఇటువంటి యువ వైద్యులు మన రాష్ట్రానికి ఎంతో అవసరమని, సకాలంలో పీఆర్ ఇచ్చి వారి వైద్య సేవలు రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్, సాదిక్ బాబు, సిద్ధూ తేజస్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం... ఢిల్లీ వెళ్లి ఎన్ఎంసీని సంప్రదిస్తాం : ఏపీఎంసీ చైర్మన్

విదేశీ వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలన్న సదుద్దేశంతో ఉన్నామని, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామని ఆంధ్ర ప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు అన్నారు. యువ వైద్యుల పట్ల తమకు ఎటువంటి ద్వేష భావం లేదని స్పష్టం చేశారు. ఎఫ్ఎంజీల విషయంలో ఒక్కో దేశంలో ఒక్కో విధంగా నిబంధనలున్నాయని, అందరి విద్యార్థుల సమస్యలూ ఒకే విధంగా లేవని ఆయన వివరించారు. శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఏపీఎంసీ కార్యాలయంలో రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎఫ్ఎంజీలకు శాశ్వత రిజిస్ట్రేషన్ ఇచ్చే విషయంలో అపోహలు, అనుమానాలకు తావు లేదన్నారు. ఇది గతంలోనూ ఉన్నదేనని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అప్పటి కౌన్సిల్ రాజీనామా చేయడం, కొత్త కౌన్సిల్ ఏర్పాటు కావడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. ఎఫ్ఎంజీల శాశ్వత నమోదు విషయంలో తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. యువ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సానుకూలంగా ఉన్నారని, విద్యార్థులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. ఎఫ్ఎంజీల సమస్యలపై దాదాపు రెండు గంటల పాటు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ నరసింహం తమతో చర్చించారని శ్రీహరిరావు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు తామిద్దరం ఢిల్లీ వెళ్లి ఎన్ఎంసీ అధికారులను కలుస్తామని, రిజర్వ్‌లో ఉన్న కోర్టు తీర్పు కూడా ఈలోగా వచ్చే అవకాశాలున్నాయని వారు వివరించారు. విద్యార్థులు విలువైన భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, ధర్నాలు, ఆందోళనలు చేయకుండా ఇంటర్న్‌షిప్ విధులను కొనసాగించాలని, ప్రభుత్వం మీ భవిష్యత్ కోసం కట్టుబడి ఉందని తెలిపారు.

మామిడి రైతుల కష్టాలపై సీఎం స్పందించాలి

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మామిడి రైతులు పడుతున్న కష్టాలపై సీఎం చంద్రబాబు స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మామిడి పంటకు దేశంలోనే రాష్ట్రం ఎంతో ప్రసిద్ధి చెందినదనీ, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో మామిడి పంట కొనుగోలు లేక రైతులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కర్నాటకలో మామిడి కొనుగోలు (2025-26)కు సంబంధించి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) ద్వారా కేంద్రం జోక్యం చేసుకొని... క్వింటాకు రూ.1,616 చొప్పున గరిష్ఠంగా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలుకు సిద్ధమైందన్నారు. ఆ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్... కర్నాటకకు చెందిన కేంద్రమంత్రి కుమారస్వామి రాసిన లేఖకు స్పందించి తిరుగు లేఖ రాయటం గమనార్హమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మామిడి కొనుగోలును పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మామిడి కొనుగోలుపై కేంద్రంతో సంప్రదించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ట్రంప్‌కు మోదీ దాసోహం

- అమెరికాతో 'కాంపాక్ట్' భారత్‌కు తీవ్ర నష్టం
- తక్షణమే ప్రక్రియ నిలిపివేయాలి
- క్షీర సాగర్, రావుల వెంకయ్య డిమాండ్
- 9న సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

న్యూఢిల్లీ: దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ట్రంప్ ప్రభుత్వానికి మోదీ సర్కార్ దాసోహమైందని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్షీర సాగర్, రావుల వెంకయ్య విమర్శించారు. అమెరికా సుంకాల ఒత్తిడిని తలొగ్గని వియత్నాం, కంబోడియా, ఇండోనేసియా వంటి చిన్న దేశాలకు పూర్తి భిన్నంగా మోదీ ప్రభుత్వ వైఖరి ఉందని శుక్రవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. అమెరికా-భారత్‌కు మధ్య వాణిజ్య ఒప్పందం కింద 21వ శతాబ్దం కోసం కాంపాక్ట్ (కెటలైజింగ్ ఆపర్చునిటీస్ ఫర్ మిలటరీ పార్ట్‌నర్‌షిప్, యాక్సిలరేటెడ్ కామర్స్ అండ్ టెక్నాలజీ) దిశగా జరుగుతున్న కసరత్తులను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం దేశ రైతులకు మరణ శాసనంగా పరిణమిస్తుందని హెచ్చరించారు. అమెరికాతో చర్చలు ఆపాలని, భారత ప్రతినిధులను వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు. చైనాకు వ్యవసాయ ఎగుమతుల్లో 55 శాతం క్షీణతను ఎదుర్కొంటున్న అమెరికాకు తమ వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులను భారత్‌లో కుమ్మరించేందుకు ఇదొక అవకాశంగా ట్రంప్ సర్కార్ భావిస్తోందని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల దిగుమతుల సునామీయే వచ్చిందని, ఈ కారణంగా 2025లో మొదటి మూడు నెలల్లో ఒక్క మహారాష్ట్రలోనే 767 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని క్షీరసాగర్, రావుల వెంకయ్య తెలిపారు. ఈనెల 9వ తేదీలోగా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం కోసం ప్రక్రియ హడావిడిగా సాగిస్తున్నారన్నారు. అమెరికాతో ఒప్పందం జరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఈ ఒప్పందాన్ని పరివర్తనాత్మకమైనదిగా మోదీ ప్రభుత్వం అభివర్ణిస్తున్నది కానీ అదే జరిగితే మన యువశక్తి దోపిడీకి గురవుతుందని, దేశం సార్వభౌమత్వాన్ని కోల్పోతుందని క్షీర సాగర్, రావుల వెంకయ్య ఆందోళన వ్యక్తంచేశారు. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం లక్ష్యం అచరణసాధ్యం కాదన్నారు. తద్వార గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతాయని హెచ్చరించారు. అమెరికా వల్ల వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, సార్వభౌమత్వానికి నష్టం ఉండదన్న హామీ కోసం పార్లమెంటు స్థాయి పరిశీలన పారదర్శకంగా జరగాలని ఏఐకేఎస్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు సీటీయూలు, ఎస్‌కేఎం పిలుపు మేరకు ఈనెల 9న సార్వత్రిక సమ్మె విజయవంతానికి క్షీర సాగర్, రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

ఎన్నికల్లో సంస్కరణలు: సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల్లో సంస్కరణలు తేవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పోలింగ్ బూత్‌లలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లు ఉపయోగించే వరుసక్రమాన్ని మార్చాలని సూచించారు. వీవీ ప్యాలెట్లు/ఈవీఎం మిషన్ల తయారీ, నిర్వహణలో ప్రైవేట్ కంపెనీలు, వ్యక్తుల పాత్ర ఉండకూడదన్నారు. డీలిమిటేషన్‌లో పెంచబోయే సీట్లను దామాషా నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. జమిలీ ఎన్నికలు రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తాయన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలు వేర్వేరుగా జరగాలని, ఆ మూడు వ్యవస్థల సమాహారమే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అని చెప్పారు. ఎన్నికల బాండ్లు రద్దు చేయాలని, రాజకీయ పార్టీల ఖర్చుపై పరిమితి విధించాలని సూచించారు. ఓటర్ల జాబితా తయారీ పారదర్శకంగా ఉండాలన్నారు. దొంగ ఓట్ల చేర్పులను అరికట్టాలన్నారు. ఫాం(17సీ) మొదటి భాగం పోలింగ్ పూర్తయిన వెంటనే వెబ్‌సైట్‌లో పెట్టాలని, రెండవ భాగాన్ని (ఫాం 20) ఫలితాలు విడుదలైన వెంటనే అప్‌లోడ్ చేయాలని కోరారు. ఫలితాల తర్వాత వచ్చే అభ్యంతరాల పరిశీలనలకు సీసీటీవీ ఫుటేజీలను బహిరంగ పర్చాలన్నారు. ఎన్నికల కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు పాత్ర ఉండాలని చెప్పారు. తొలుత ఎన్నికల విధానంపై సీపీఎం ప్రచురించిన పుస్తకాన్ని పార్టీ నేతలు విడుదల చేశారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, దొడ్డి కొమరయ్యలకు శ్రీనివాసరావుతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, రమాదేవి పూలమాలలేసి నివాళులర్పించారు.

చంద్రబాబు కోసం అజ్ఞాత పోలీస్ ముఠా: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు తనకు అనుకూలమైన విశ్రాంత, సర్వీస్‌లో ఉన్న ఐపీఎస్‌లతో కలిపి ఒక అజ్ఞాత ముఠాను చంద్రబాబు ఏర్పాటు చేసుకున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఈ అజ్ఞాత ముఠా పర్యవేక్షణలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపైన ఎలా తప్పుడు కేసులు బనాయించాలి, ఎలా దాడులు చేసి అరాచకం సృష్టించాలో వ్యూహరచన జరుగుతోందని అన్నారు. ఈ ముఠాలో ఎవరెవరు ఉన్నారో తమకు తెలుసునని, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చంద్రబాబు డబ్బుతోనే జనసేనను పవన్ కల్యాణ్ నడుపుతున్నాడని మండిపడ్డారు.

సమృద్ధిగా ఎరువుల నిల్వలు: డిల్లీ రావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పది రోజులలో రాష్ట్రంలో వరి నాట్లు పుంజుకునే అవకాశం ఉన్నందున ఎరువుల సరఫరా, పంపిణీపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీ రావు సూచించారు. ఎరువుల కంపెనీల ప్రతినిధులతో ఖరీఫ్‌లో ఎరువుల సరఫరా, పంపిణీపై శుక్రవారం సమీక్షించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులలో నీటి నిల్వలు బాగా పెరిగాయని, కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసినట్టు చెప్పారు. వివిధ రకాల ఎరువులు 8.73 లక్షల మెట్రిక్ టన్నులు రైతాంగానికి అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ మాసానికి 3.84 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరాను చేయాలని ఎరువుల తయారీదారులను ఆదేశించారు. యూరియా... ఖరీఫ్‌లో సరాసరి 6.22 లక్షల మెట్రిక్ టన్నుల వినియోగంలో ఉండగా ఈ ఏడాది కేంద్రం ద్వారా 6.22 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులు జరిగాయన్నారు. 1.95 లక్షల మెట్రిక్ టన్నులు నేడు రాష్ట్రానికి రాగా నిల్వతో కలిపి రాష్ట్రంలో 4.93 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. దొరకదనే దుష్ప్రచారం నమ్మవద్దని, ముందుస్తు కొనుగోళ్లు చేయవద్దని సూచించారు. ఎవరైనా డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లించినా... ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించినా వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అదనపు వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి, సంయుక్త సంచాలకులు కృపదాస్ పాల్గొన్నారు.

3 నెలలకోసారి జాబ్ మేళాలు

ఆగస్టు నుంచి అక్షరాంధ్ర

సెప్టెంబరులో నైపుణ్యం పోర్టల్

మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా యువత, పరిశ్రమలను అనుసంధానానికి అభివృద్ధి చేస్తున్న నైపుణ్యం పోర్టల్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సిద్ధం కావాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నమోదైన వారికి ఆటోమేటిక్‌గా రెజ్యూమే సిద్ధమయ్యేలా పోర్టల్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని, ఉద్యోగ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్‌లో పనిచేయాలని అధికారులకు లోకేశ్ ఆదేశాలు ఇచ్చారు. ఆయన శుక్రవారం ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాబ్ మేళాల నిర్వహణకు చర్యలు చేపట్టాలని, ఆ దిశగా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల పనితీరుపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీ పర్యటన అనంతరం ఐటీఐల అభివృద్ధికి హబ్ అండ్ స్పోక్ విధానంలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం ద్వారా రూ.600 కోట్లు కేటాయించినట్లు లోకేశ్ తెలిపారు. విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనను సులభతరం చేసేలా ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరపాలన్నారు. ఆగస్టు 7 నుంచి అక్షర ఆంధ్ర (ప్రాజెక్ట్ అఆ) నిర్వహించనున్నట్లు అధికారులు ఆయనతో చెప్పారు. పదో తరగతి పూర్తైన విద్యార్థులు ఇంటర్ లేదా వృత్తి విద్యాకోర్సుల్లో తప్పనిసరిగా ప్రవేశం పొందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రతి విద్యార్థి ఎక్కడ ప్రవేశం పొందారో గుర్తించాలని, పాఠశాల విద్యతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రతి ఏడాది ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఇబ్బందులు తలెత్తకుండా లాంగ్వేజ్ సబ్జెక్ట్ మార్కులను మిగతా సబ్జెక్టుల మార్కుల సగటుగా ఉండాలని లోకేశ్ ఆదేశించారు. సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేశ్ కుమార్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ అండ్ మొబిలిటీ అడ్వైజర్ సీత శర్మ, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రఘు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు.

అభ్యర్థనలు పరిశీలించాక డీఎస్సీ తుది 'కీ'

అన్ని అడ్డంకులు దాటుకొని 16,437 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని 23 రోజుల్లో సజావుగా నిర్వహించామని లోకేశ్ అన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించిన అధికారులందరికీ ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. డీఎస్సీ ప్రాథమిక 'కీ' విడుదల చేశామని, అభ్యర్థనలు పరిశీలించాక తుది 'కీ' విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు. కోర్టు కేసులతో డీఎస్సీని అడ్డుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందని మండిపడ్డారు. కోర్టులో 31 కేసులు వేసినప్పటికీ, పరీక్షలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగాయని వెల్లడించారు. ఎస్సీ ఉప వర్గీకరణ, మూడు శాతం స్పోర్ట్స్ కోటా వంటి నిబంధనలు పాటించామని తెలిపారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు 5.77 లక్షల దరఖాస్తులు సమర్పించారని, 92.9 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని మంత్రి లోకేశ్ వెల్లడించారు.

ప్రజాసేవకు సరైన వేదిక పీ4

బంగారు కుటుంబాలకు సంక్షేమంలో కోత ఉండదు

పీ4 అమలుకు రెండు కమిటీలు, 2 చాప్టర్ల ఏర్పాటు

లోగోను ఖరారు చేసిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న పీ4 విధానంపై కీలక అడుగులు పడ్డాయి. ప్రజాసేవకు సరైన వేదిక పీ4 అని, దీనిని దాతలందరూ సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. పేదల బతుకుల్లో వెలుగును నింపేలా పీ4 విధానాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ తొలి సర్వసభ్య సమావేశం శుక్రవారం చంద్రబాబు నేతృత్వంలో జరిగింది. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. పీ-4 పథకం సమర్థ అమలుకు రాష్ట్ర స్థాయిలోఎగ్జిక్యూటివ్ కమిటీ, అడ్వైజరీ కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. జిల్లా, నియోజకవర్గం స్థాయిలో పీ4 చాప్టర్ల ఏర్పాటుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆయా కమిటీల్లో స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సహా ఇన్‌చార్జి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. పీ4 స్ఫూర్తిని చాటేలా లోగోను ఖరారు చేసిన ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్ష మంది మార్గదర్శులను గుర్తించే లక్ష్యంతో పని చేయాలన్నారు. పీ4 బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చే మార్గదర్శుల పాత్రపై మరింత స్పష్టత అవసరమన్నారు. బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా, స్వావలంబన సాధించేలా అవసరమైనప్పుడు సాయం, మార్గనిర్దేశనం చేసేలా మార్గదర్శులు ఉండాలని సూచించారు. వివిధ నియోజకవర్గాల పరిధిలో ఉండే ఎన్ఆర్ఐలు, వివిధ పరిశ్రమలు.. ధనవంతులు ఎవరో గమనించాలని, వివిధ రూపాల్లో పేదలకు సేవలు అందించే వారిని గుర్తించాలని అన్నారు. అలాంటి వారిని పీ4తో అనుసంధానం చేయాలని నేతలకు, అధికారులకు సీఎం సూచించారు.

సంక్షేమానికి అదనంగా పీ4

బంగారు కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదని చంద్రబాబు స్పష్టం చేశారు. సంక్షేమాన్ని కొనసాగిస్తూనే.. బంగారు కుటుంబాలకు ఆర్థిక చేయూత అందుతుందని తెలిపారు. 'మార్గదర్శుల ఎంపిక కోసం.. పేదలకు సాయం కోరుతూ చాలా మందితో మాట్లాడాను. చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారు. పేదలకు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు' అని సీఎం అన్నారు. 'ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడానికి ప్రజా ప్రతినిధులకూ పీ4 అద్భుతమైన వేదిక. ప్రతి నియోజకవర్గంలోనూ 6-10 వేల పేద కుటుంబాలు బంగారు కుటుంబాలుగా ఎంపిక కానున్నాయి. ఎమ్మెల్యేలకు ఇంతకు మించిన అవకాశం ఉండదు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని సూచించారు. అధికారులు బంగారు కుటుంబాలు, మార్గదర్శుల వివరాలను ఎప్పటికప్పు అప్డేట్ చేయాలి. రియల్ టైమ్ నుంచి డేటా తీసుకోవాలి. దీని కోసం ప్రత్యేకంగా డ్యాష్ బోర్డు ఉంటుంది' అని తెలిపారు. పీ4 అమల్లో బాపట్ల జిల్లా అగ్రభాగంలో ఉందని చంద్రబాబు... ఆ జిల్లా ప్రజా ప్రతినిధులను కలెక్టరును అభినందించారు. సమావేశంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు, సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనైతిక బదిలీలు రద్దు చేయాలి

ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పారదర్శకతలేని గ్రామ/వార్డు సచివాలయాల అనైతిక బదిలీల ప్రక్రియను రద్దు చేసి సీనియార్టీ ప్రకారం బదిలీలు నిర్వహించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ జానీ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయాల శాఖ సంచాలకులు ఎం.శివప్రసాద్‌కు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా, నిబంధనలకు తూట్లు పొడుస్తూ కొనసాగుతున్న బదిలీలతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. బదిలీలలో కనీసం ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి, వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, సీనియార్టీని పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా సిఫార్సు లేఖల ఆధారంగా పోస్టింగులు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. చాలా జిల్లాల్లో కనీసం కౌన్సెలింగ్ ప్రక్రియ జరగలేదని, ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేయని వారు బదిలీ కోసం దరఖాస్తు చేయనప్పటికీ బలవంతంగా బదిలీలు చేస్తున్న అంశం అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తక్షణమే బదిలీలు నిలుపుదల చేసి తిరిగి బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలని, సీనియార్టీ జాబితాను విడుదల చేసి ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా న్యాయబద్ధంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

కువైట్ నిర్మాణ రంగంలో యువతకు ఉద్యోగాలు

12లోగా దరఖాస్తు చేసుకోవాలి : ఏపీఎస్ఎస్‌డీసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (ఓఎంసీ ఏపీ) థట్రుయా వారి భాగస్వామ్యంతో కువైట్‌లోని నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాల కోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి చెందిన అనుభవజ్ఞులైన నిర్మాణ కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ మాట్లాడుతూ సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ లేదా సీలింగ్ వర్క్‌లో డిప్లొమా కలిగి ఉండి, 3-5 సంవత్సరాల అనుభవం ఉన్న 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుష అభ్యర్థుల నుంచి 2 సంవత్సరాల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. నెలకు 200 నుంచి 250 వరకు కువైట్ కరెన్సీ (సుమారుగా రూ.56 వేల నుంచి) జీతం ఉంటుంది. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాసం వంటి ఏర్పాట్లను కంపెనీ వారు ఏర్పాటు చేస్తారని, అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, డిప్లొమా సర్టిఫికెట్, అనుభవ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తులను naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని లేదా తమ బయోడేటాను skillinternational@apssdc.in కు మెయిల్ చేయవచ్చని తెలిపారు. లేదా హెల్ప్ లైన్ నంబర్ 9988853335 లో సంప్రదించవచ్చని ఆయన తెలియజేశారు.

అందుబాటులో డీఎస్సీ ప్రాథమిక కీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మెగా డీఎస్సీలో భాగంగా జూన్ ఆరు నుంచి 28 వరకు నిర్వహించిన వివిధ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఏపీ డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ (కేటగిరి) వాణిజ్యం, ఇంగ్లీషు, హిందీ, ఫిజికల్, సంస్కృతం, తెలుగు పరీక్షల కీలు, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) కేటగిరీలో ఇంగ్లీషు, ఫిజిక్స్, ఎస్జీటీ(కేటగిరిలో ఎస్జీటీ, టీజీటీ ఇంగ్లీషు, హిందీ, ఫిజికల్స్, సైన్స్, సోషల్, తెలుగు, ఇంగ్లీషు, పీఈటీ పరీక్షల కీలను ఉంచారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 11లోగా పంపాలన్నారు. పూర్తి వివరాలను https://apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అల్లూరి, పింగళి, స్వామి వివేకానందకు నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు జయంతి, పింగళి వెంకయ్య, స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడి వర్ధంతుల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తదితరులు శుక్రవారం నివాళులర్పించారు. అల్లూరి 128వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా... అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రాణాలనే అర్పించిన త్యాగమూర్తి అల్లూరి : చంద్రబాబు

మన్యం ప్రజల మాన, ప్రాణ రక్షణ కోసం తెల్లదొరలను ఎదిరించి తన ప్రాణాలనే అర్పించిన త్యాగమూర్తి అల్లూరి అని సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవం వైపు నడిపించే స్ఫూర్తిని అందించిన ఆ వీరుని దేశభక్తిని, ప్రజా పోరాటాన్ని స్మరించుకుందామన్నారు. దేశ ఆత్మగౌరవ ప్రతీక అయిన జాతీయ పతాకాన్ని రూపొందించిన గొప్ప దేశభక్తుడు, జియాలజిస్ట్, రచయిత పింగళి వెంకయ్యను స్మరించుకుందామని అన్నారు. జీవితంలో ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎంతైనా సాధించగలం అని వివేకాంద చరిత్ర మనకు చెబుతోందని పేర్కొన్నారు.

మన్యం వీరుడి స్ఫూర్తిని భావి తరాలకు అందించాలి: పవన్

దాస్య శృంఖలాలతో స్వేచ్ఛకు దూరమైన సమాజంలో పోరాట జ్వాలలు రగిలించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆ వీరుడి జయంతి సందర్భంగా హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నానని అన్నారు.

అల్లూరి స్వాతంత్ర్య పోరాటం చిరస్మరణీయం : జగన్

బ్రిటీష్ పాలనను ఎదురించి, స్వరాజ్య సాధనలో ప్రాణాలు సైతం పణంగా పెట్టి పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని మాజీ సీఎం జగన్ కొనియాడారు. మువ్వన్నెల జాతీయ జెండాను రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు మనస్ఫూర్తిగా నివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. స్ఫూర్తి దాయక ప్రసంగాలతో యువతను చైతన్య పరిచిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని జగన్ కొనియాడారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.